RNI No :TELTEL2022/83073

# వేద న్యూస్

దినపత్రిక

వరంగల్ | మంగళవారం | పేజీలు : 6
సంపుటి : 4, సంచిక : 38 | జనవరి 13, 2026 | వెల : రూ.3-00




3లో..

## ప్రజావాణి దరఖాస్తులు పెండింగ్‌లో ఉండకూడదు

# పందెం కోడ్ఢ!

- తెలుగు రాష్ట్రాల్లో కోడి పందేలు షురూ
- ఆంధ్రాలో మూడు రోజుల్లోనే వందల కోట్ల వ్యాపారం

- మినీ స్టేడియాలను తలపించేలా భారీ ఏర్పాట్లు
- ఫ్లడ్ లైట్ల వెలుతురులో రాత్రింబవళ్లు నిర్వహణ
- అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా..
- పందేలకు లీడర్ల సహకారం
- పొలిటీషియన్లు, బడాబాబుల కు గమ్మత్తు ఆట
- తెలంగాణ నుంచి సైతం భారీగా వెళ్తున్న పందెంరాయుళ్లు
- ఇప్పటికే హోటళ్లు, లాడ్జీలన్నీ బుక్
- కోడి పందేలు వద్దంటూ తాజాగా ఏపీ హైకోర్ట్ ఆదేశాలు



**వేద న్యూస్, ప్రత్యేక ప్రతినిధి:**

తెలుగు లోగిళ్లలో సంక్రాంతి సందడి మొదలైంది. పచ్చని తోరణాలు, ముత్యా ల ముగ్గులు, గంగిరెద్దుల విన్యాసాల మధ్యే.. 'కోడి పందెం' కత్తి నూరుతోంది. పండగంటే పరమాన్నం.. కానీ పందెం రాయు ళ్లకు మాత్రం పౌరుషం... ఒకప్పుడు పల్లెటూరి వినోద ంగా సాగిన ఈ ఆచారం, ఇప్పుడు హైటెక్ హంగులు అద్దు కుని వందల కోట్ల రూపాయల ఆటగా మారింది. కోర్టుల నిషేధాజ్ఞ లు, పోలీసుల సవాల్‌లను బేఖాతరు చేస్తూ.. ఉమ్మడి గోదావరి, కృష్ణా, గుంటూరు జిల్లాల్లో బరులు మినీ స్టేడియాలను తలపిస్తు న్నాయి. వేల రూపాయలతో మొదలై లక్షలు దాటి కోట్లలో చేతులు మారుతున్న పందెం సొమ్ము, విదేశీ మద్యం, విలాసవంతమైన గ్యాల రీలు, హై ప్రొఫైల్ అతిథుల రాకతో ఏపీలోని బరులు ఇప్పుడు సిండికేట్ల అడ్డాగా మారిపోయాయి. ఈ పోటీలకు తెలంగాణ నుంచి కూడా భారీగా బడా బాబులు, పొలి టికల్ లీడర్లు, సెలబ్రెటీలు సైతం



వెళ్లి పందెం కాయడం గమ నార్హం. అంతేకాదు.. తెలంగాణ సరిహ ద్దు గ్రామాల్లో సైతం కోడి పందేలు నిర్వహణ పెద్ద బిజినెస్ గా మారిపోయింది.

3లో..




వేద న్యూస్ తెలుగు దినపత్రిక క్యాలెండర్ – 2026ను సోమవారం ఆవిష్కరిస్తున్న వరంగల్ ట్రాఫిక్ సీఐ సుజాత



వేద న్యూస్ తెలుగు దినపత్రిక క్యాలెండర్ – 2026ను సోమవారం ఆవిష్కరిస్తున్న దేవాదాయ ధర్మదాయ శాఖ వరంగల్ అసిస్టెంట్ కమిషనర్ సునీత




వేద న్యూస్ తెలుగు దినపత్రిక క్యాలెండర్ – 2026ను సోమవారం ఆవిష్కరిస్తున్న హన్మకొండ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ అప్పయ్య

## దివ్యాంగులు ఆత్మగౌరవంతో నిలబడాలి

- వారికి ప్రభుత్వం అండ ఎప్పటికీ ఉంటుంది
- రూ.50 కోట్లతో ఉపకరణాల పంపిణీ
- ట్రాన్స్‌జెండర్లకు ఉద్యోగాలు, ఇళ్లతో పాటు ప్రాతినిధ్యం
- ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి
- బాల భరోసా, ప్రణామ్ డే కేర్ సెంటర్ల ప్రారంభం

**వేద న్యూస్, హైదరాబాద్:**



సమాజంలో దివ్యాంగులు ఆత్మగౌరవంతో జీవించే విధం గా సహాయ సహ కారాలు అందించడంలో ప్రభుత్వం మానవీయ దృక్పథంతో పని చేస్తోందని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. దివ్యాంగులు తమ కుటుంబానికి భారమని భావించి ఆత్మన్యూనతకు లోనవ్వాల్సిన అవసరం లేదని, ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. జ్యోతిరావు పూలే ప్రజాభవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి దివ్యాంగులకు సహాయ ఉపకరణాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ... గతంలో ఎప్పుడూ లేని విధంగా ప్రభుత్వం రూ.50 కోట్లు కేటాయించి దివ్యాంగులకు అవసరమైన ఉపకరణాలు అందించి ఆత్మవిశ్వాసం కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ

మిగతా 3వ పేజీలో..

## కాంగ్రెస్ ప్రభుత్వం ఏ అభివృద్ధీ చేయలేదు



- రెండేళ్లు గడిచినా ఒక్క పనికీ శ్రీకారం చుట్టలేదు
- బీఆర్ఎస్ ను ప్రజలు ఏమాత్రం మరిచిపోలేదు
- పట్టణాలు, పల్లెల రూపాంతరానికి కేసీఆర్ నాయకత్వమే కారణం
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

**వేద న్యూస్, మహబూబ్‌నగర్:**

అసెంబ్లీ ఎన్నికల్లో స్వల్ప తేడాతో ఓడిపోయినప్పటికీ, బీఆర్ఎస్ హయాంలో చేసిన అభివృద్ధిని ప్రజలు మర్చిపోలేదని.., కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు గడిచినా ఒక్క కొత్త అభివృద్ధి పనికీ శ్రీకారం చుట్టలేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. మహబూబ్‌నగర్, నారాయణపేట జిల్లాల్లో బీఆర్ఎస్ తరఫున గెలిచిన సర్పంచ్‌లు, వార్డు సభ్యులతో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన ప్రజా ప్రతినిధులకు అభినందనలు తెలియజేస్తూ, పార్టీని గ్రామ స్థాయి నుంచి మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో కేటీఆర్ మాట్లాడుతూ.. 2014కు ముందు మహబూబ్‌నగర్ పట్టణ పరిస్థితి, నేడు కనిపిస్తున్న అభివృద్ధి మధ్య తేడా స్పష్టమని అన్నారు. మహబూబ్‌నగర్‌తో పాటు నారాయణపేట, వనపర్తి, నాగర్‌కర్నూల్, గద్వాల్ వంటి పట్టణాలు గత పదేళ్లలో గణనీయంగా అభివృద్ధి చెందాయన్నారు. ఈ మార్పుకు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వమే ప్రధాన కారణమని స్పష్టం చేశారు. పట్టణ ప్రగతి, పల్లె ప్రగతి కార్యక్రమాల ద్వారా పల్లె, పట్టణం అన్న తేడా లేకుండా సమగ్ర అభివృద్ధి జరిగిందని కేటీఆర్ గుర్తు చేశారు. గతంలో ట్రాక్టర్లు, నీటి ట్యాంకర్లు, ఇంటింటి నల్లా కనెక్షన్లు, వీధి దీపాలు, డంపింగ్ యార్డులు, వైకుంఠధామాలు, పల్లె ప్రకృతి వనాలతో గ్రామాలకు కొత్త రూపు ఇచ్చామని తెలిపారు. ప్రస్తుతం మాత్రం ట్యాంకర్లలో నీళ్లు లేవని, ట్రాక్టర్లకు డీజిల్ లేదని, వీధి దీపాలు వెలగడం లేదని కాంగ్రెస్ పాలనపై విమర్శలు గుప్పించారు. ఆత్మీయ సమ్మేళనం ద్వారా పార్టీ శ్రేణులు ఐక్యంగా పనిచేసి ప్రజల మధ్యకు వెళ్లి వాస్తవాలను వివరించాలని కేటీఆర్ సూచించారు. బీఆర్ఎస్ ఐక్యతే మళ్లీ ప్రజల మద్దతుతో అధికారంలోకి వచ్చే మార్గమని విశ్వాసం వ్యక్తం చేశారు.



వేద న్యూస్ తెలుగు దినపత్రిక -2026 క్యాలెండర్ ను ఆవిష్కరిస్తున్న జనసేనాని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అభిమాని లింగబత్తిని సుబ్రమణ్యం

## 'సివిల్ సూట్' సరైన మార్గం

- పోలవరం-నల్లమల్ల సాగర్ కేసులో సుప్రీంకోర్టు కీలక తీర్పు
- తెలంగాణ రిట్ పిటిషన్‌కు విచారణ అర్హత లేదన్న ధర్మాసనం
- గోదావరి జలాలపై అన్ని రాష్ట్రాల వాదనలు వినాల్సిందే

**వేద న్యూస్, న్యూఢిల్లీ ప్రతినిధి:**

పోలవరం-నల్లమల్ల సాగర్ ప్రాజెక్టుల అంశంలో తెలంగాణ ప్రభుత్వం దాఖలు చేసిన రిట్ పిటిషన్‌పై సుప్రీంకోర్టు కీలక తీర్పు వెలువరించింది. ఈ పిటిషన్‌కు

మిగతా 3వ పేజీలో..



## వేద న్యూస్-2026 క్యాలెండర్ ఆవిష్కరణ

**వేద న్యూస్, వేములవాడ:**



రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ పట్టణంలో ఆర్యవైశ్య నిత్యాన్న సత్రం అధ్యక్షుడు, కృషి రత్న బుస్సా శ్రీనివాస్ "వేద న్యూసు తెలుగు దినపత్రిక -2026 క్యాలెండర్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ..ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా వేద న్యూస్ తెలుగు పత్రిక చక్కగా పని చేస్తున్నదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వేద న్యూస్ తెలుగు దినపత్రిక ఎడిటర్, సిఎండీ లింగబత్తిని కృష్ణ, సిరిసిల్ల జిల్లా స్టాఫర్ పైడి రాజు, బోయినిపల్లి మండల రిపోర్టర్ మహేష్, సత్రం అకౌంటెంట్ ముత్యం కృష్ణప్రసాద్, సత్రం సూపర్వైజర్ రేగురి లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

# విశ్వకర్మల సమస్యలు సీఎం దృష్టికి తీసుకెళ్తా

**- ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి**

**వేద న్యూస్, హనుమకొండ :**

విశ్వకర్మల సమస్యలు సీఎం దృష్టికి తీసుకెళ్తానని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి పేర్కొన్నారు. వరంగల్ లోని కీర్తి గార్డెన్స్‌లో విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ ఐక్య సంఘం సర్వసభ్య సమావేశం ఘనంగా జరిగింది. విశ్వకర్మ భగవాన్ పూజతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఇటీవల స్వర్గస్తులైన విశ్వబ్రాహ్మణులకు సంతాపం తెలియజేశారు. ఈ సందర్భంగా పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ విశ్వబ్రాహ్మణులకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని పేర్కొన్నారు. అర్హులైన వారికి ప్రభుత్వ పథకాలు అందజేస్తామని వివరించారు. విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ ఐక్య సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎర్రోజు బిక్షపతి చారి మాట్లాడుతూ విశ్వబ్రాహ్మణ కుల వృత్తులపై జరుగుతున్న దోపిడీని అరికట్టాలని డిమాండ్ చేశారు. వృత్తి భద్రత కల్పించాల్సిందిగా ప్రభుత్వాన్ని కోరారు. 50 సంవత్సరాలు నిండిన విశ్వబ్రాహ్మణులకు పెన్షన్ కల్పించాలన్నారు. విశ్వబ్రాహ్మణ వృత్తికి ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి,పాలక మండలి నియామకం చేయాలన్నారు. ప్రభుత్వం స్పందించ కంటే ఉద్యమ బాట పెడతామనే హెచ్చరించారు. విశ్వబ్రాహ్మణ కుల బంధువుల అభిప్రాయాలను సేకరించి, భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు. రాబోయే రోజుల్లో విశ్వబ్రాహ్మణుల హక్కుల సాధన కోసం ప్రత్యేక సమావేశాలు నిర్వహిస్తూ, జాతి అభివృద్ధి దిశగా ముందుకు సాగుతామని ప్రకటించారు. వివిధ జిల్లాల నుంచి వచ్చిన అధ్యక్షులు



అభిప్రాయాలను వెల్లడించారు. ఈ సమావేశానికి హాజరైన మానుకోట మాజీ శాసనసభ్యులు బండి పుల్లయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు నౌండ్ల సంతోష్ చారి, రాష్ట్ర కార్యదర్శి కల కోటి శ్రీధర్, నందిపేట రవీంద్ర చారి, తల్లోజు చెన్నయ్య చారి, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ శృంగారం భాస్కరాచారి,మాటూరు రమేష్ చారి (వరంగల్ జిల్లా),ములుగు జిల్లా మహిళా నాయకురాలు గుంటోజు పావని మేడారం సమ్మక్క సారవమ్మ జాతర కమిటీ డైరెక్టర్, శృంగారపు వెంకటేశ్వర చారి (హనుమకొండ), పాములపర్తి వేణుగోపాల చారి (కరీంనగర్), బండోజు ఉపేంద్ర చారి (మహబూబాబాద్),సతీష్ చారి (భూపాలపల్లి),రాజన్న చారి (ములుగు),సాయి అన్న శ్రీనివాస చారి (సిద్దిపేట),గోపాల చారి (సిరిసిల్ల),భీమోజు సురేంద్ర చారి (పెద్దపల్లి),మట్టల రమేష్ చారి (మంచిర్యాల),శ్రీరామోజు భాస్కరాచార్య (కొమురం భీం ఆసిఫాబాద్),భాష పెల్లి రమేష్ చారి (మేడ్చల్) రాష్ట్ర నాయకులు జిల్లా నాయకులు మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# తరాతరాలకు ఆదర్శం స్వామి వివేకానంద

**- బెస్ట్ ఫ్రెండ్స్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు పులి దేవేందర్ ముదిరాజ్**

**వేద న్యూస్, హనుమకొండ :**

ఎన్ని తరాలు మారిన స్వామి వివేకానంద యువతకు స్ఫూర్తి గానే ఉంటారని "బెస్ట్ ఫ్రెండ్స్ ఫౌండేషను వ్యవస్థాపక అధ్యక్షులు పులి దేవేందర్ ముదిరాజ్ అన్నారు. సోమవారం స్వామి వివేకానంద జయంతి సందర్భంగా.. హనుమకొండలోని ఫౌండేషన్ కార్యాలయంలో స్వామి వివేకానంద చిత్రపటానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం పులి దేవేందర్ మాట్లాడుతూ.. ప్రపంచ దేశాలకు భారత దేశ ఔన్నత్యాన్ని తెలియజేసిన గొప్ప వ్యక్తి స్వామి వివేకానంద అని అన్నారు. యువత స్వామి వివేకానంద ను ఆదర్శంగా తీసుకొని సమాజంలో గుర్తింపు పొందాలని తెలిపారు. ప్రతి ఒక్కరు చదువు పై దృష్టి పెట్టాలని.. విద్య ద్వారా ఏదైనా సాధించవచ్చని అన్నారు. అనంతరం ఫౌండేషన్ సభ్యులు గరిపెల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రస్తుత కాలం లో ఆర్థిక ఎదుగుదల కూడ ఎంతో ముఖ్యమని.. అందుకోసం యువత అందివచ్చిన ప్రతి అవకాశంను సద్వినియోగం చేసుకుంటూ.. ఉద్యోగ, ఉపాధి రంగాల్లో రాణించాలని అన్నారు. ఫౌండేషన్ వ్యవస్థాపక సభ్యులు,సీనియర్ జర్నలిస్ట్ బోనాల రమేష్,విద్యావేత్త పొన్నం రాజు లు సంయుక్తంగా మాట్లాడుతూ.. ఒక




నిర్దిష్టమైన లక్ష్యాన్ని ఎంచుకోవాలని, అందుకోసం కష్టనష్టాలను ఓర్చుకొని అనుకున్న లక్ష్యాన్ని చేరేవరకు విశ్రమించవద్దని అన్నారు. కార్యక్రమ నిర్వహణకు సహకరించిన లావణ్య ను పలువురు అతిథులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులు గా గరిపెల్లి శ్రీనివాస్, కొయ్యడ లక్ష్మణ్,డోలి రాజ్ కుమార్,మామిడాల అనిల్, పెంచాల అశోక్,పొన్నం రాజు, బోనాల రమేష్,నీరటి రాజు లతో పాటు ఫౌండేషన్ సభ్యులు జన్ను రాజమౌళి, హైమ రాణి,మేడిపల్లి అనిల్, రాధిక,అనుముల శ్రీలత, రవి,హంస సురేందర్,స్రవంతి, పవన్,కొక్కు సౌజన్య, బలుగూరి మౌనిక, పైండ్ల అనిత,ఊడుగుల దేవేంద్ర,గొల్ల నరేందర్,కత్తి మౌనిక, లక్కారుసు పవన్,సూర మంజుల,జిల్లా రజిత,శ్రవణ్ కుమార్,పర్నే సరస్వతి,కన్న మనీషా,పొన్నం అక్షయ,వినోద్, నరేష్,నవీన్ కుమార్,విజయ్ కుమార్ ,మిరియాల రమేష్, స్పందన,కృష్ణ,సురేష్,అశోక్ లతో పాటు బెస్ట్ ఫ్రెండ్స్ ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

# ప్రాణాలకు తెగించి.. వ్యక్తిని కాపాడి..

**- నదిలో దూకిన వ్యక్తిని రక్షించిన క్యూఆర్‌టీ-1 బృందం**

**- ధైర్యసాహసాన్ని అభినందించిన ఎస్పీ**



**వేద న్యూస్, మెదక్:**

కుటుంబ కలహాల నేపథ్యంలో ఆత్మహత్యకు ప్రయత్నించిన వ్యక్తిని సాహసోపేతంగా కాపాడిన క్యూఆర్‌టీ-1 పోలీస్ సిబ్బందికి జిల్లా ఎస్పీ డీవీ శ్రీనివాస రావు క్యాష్ రివార్డ్ ప్రకటించారు. ఈ సందర్భంగా జిల్లా పోలీస్ కార్యాలయంలో సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు. ఆదివారం ఏడుపాయల వనదుర్గామాత ఆలయం సమీపంలోని ఘనపూర్ అనకట్ట వద్ద, కామారెడ్డి జిల్లాకు చెందిన బసవయ్య అనే వ్యక్తి నదిలో దూకి ఆత్మహత్యకు ప్రయత్నించాడు. అదే సమయంలో అక్కడ విధులు నిర్వహిస్తున్న క్యూఆర్‌టీ-1 సిబ్బంది పరిస్థితిని గమనించి వెంటనే స్పందించారు. ప్రమాదకరమైన నది ప్రవాహాన్ని లెక్కచేయకుండా, తాడు సహాయంతో చాకచక్యంగా వ్యవహరించి ఆ వ్యక్తిని సురక్షితంగా ఒడ్డుకు చేర్చి ప్రాణాలను కాపాడారు. వారి ధైర్యసాహసం, సమయస్ఫూర్తి అభినందనీయమని జిల్లా ఎస్పీ పేర్కొన్నారు. ఈ ఘటనను ప్రత్యక్షంగా చూసిన స్థానిక ప్రజలు క్యూఆర్‌టీ సిబ్బంది చూపిన ధైర్యాన్ని ప్రశంసిస్తూ పోలీస్ శాఖకు కృతజ్ఞతలు తెలిపారు. గతంలోనూ ఏడుపాయల వనదుర్గామాత ఆలయ పరిసర ప్రాంతాల్లో ఆత్మహత్యలకు ప్రయత్నించిన వారిని, అలాగే ప్రమాదాల్లో చిక్కుకున్న అనేక మందిని క్యూఆర్‌టీ బృందాలు సకాలంలో రక్షించిన సంఘటనలు ఉన్నాయని ఎస్పీ గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో మెదక్ జిల్లా అదనపు ఎస్పీ ఎస్. మహేందర్, ఆర్ఐ రామకృష్ణ, ఆర్ఎస్ఐ హరీష్ రెడ్డి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## మిత్రుల జ్ఞాపకార్థం స్మారక క్రికెట్ టోర్నమెంట్



**వేద న్యూస్, మెట్‌పల్లి:**

మరణించిన మిత్రుల జ్ఞాపకార్థం స్మారక క్రికెట్ టోర్నమెంట్‌ను మెట్‌పల్లి పట్టణంలోని 13వ వార్డు (రేగుంట)లో ప్రారంభించారు. టోర్నమెంట్ నిర్వాహకుడు గుడికందుల అజయ్ మాట్లాడుతూ.. భౌతికంగా దూరమైన మిత్రుల స్మృతిగా ఈ టోర్నమెంట్‌ను నిర్వహిస్తున్నామని, వారి కుటుంబాలకు ఎల్లప్పుడూ అండగా ఉంటామని ఈ కార్యక్రమం ద్వారా తెలియజేస్తున్నామన్నారు. ప్రతి సంవత్సరం సంక్రాంతి సందర్భంగా వార్డులో సంబరాలు నిర్వహిస్తూ, యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండేలా ప్రతి పండుగకు ఏదో ఒక సామాజిక కార్యక్రమం చేపడుతున్నామని తెలిపారు. ఈ టోర్నమెంట్‌ను మండల విద్యాధికారి చంద్రశేఖర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ - యువతను క్రీడల వైపు ప్రోత్సహిస్తూ సామాజిక బాధ్యతతో కార్యక్రమాలు నిర్వహిస్తున్న అజయ్ సేవలు అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు, యువకులు తదితరులు పాల్గొని టోర్నమెంట్‌ను విజయవంతం చేశారు.

## ఆసుపత్రి నిర్మాణ పనులను వేగవంతం చేయాలి

**- ప్రజలకు మెరుగైన వైద్య సేవలే లక్ష్యం**

**- మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

**వేద న్యూస్, మంచిర్యాల:**



జిల్లా కేంద్రంలోని కాలేజ్ రోడ్డులో నిర్మాణంలో ఉన్న ప్రభుత్వ ఆసుపత్రి పనులను వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అధికారులను ఆదేశించారు. సోమ వారం ఆయన ఆసుపత్రి నిర్మాణ పనులను ఆకస్మికంగా సందర్శించి పనుల పురోగతిని పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ .. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యమని, అందుకు అనుగుణంగా ఆసుపత్రి నిర్మాణాన్ని నిర్దేశిత గడువులో పూర్తి చేయాలని సూచించారు. రూ.129.25 కోట్ల వ్యయంతో ప్రభుత్వ ఆసుపత్రి, రూ.23.75 కోట్లతో క్రిటికల్ కేర్ విభాగం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. వైద్య రంగాన్ని బలోపేతం చేస్తూ ప్రజలకు వేగవంతమైన, నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# ఘనంగా స్వామి వివేకానంద జయంతి వేడుకలు

**వేద న్యూస్, వరంగల్ టౌన్:**



వరంగల్ రంగశాయిపేటలోని శ్రీ సాయి నగర్ లో స్వామి వివేకానంద జయంతి వేడుకలు బొల్లోజు కృష్ణమూర్తి, బోళ్ళ అశోక్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కాలనీ వ్యవస్థాపక సభ్యులు పొడిశెట్టి శ్రీనివాస్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ స్వామి వివేకానంద యువతను దేశానికి ఉపయోగపడే విధంగా వారి యొక్క ప్రవచనాలు, సూక్తులు రూపొందించారని అన్నారు. ఆధునిక సమాజంలో యువత పెడదారిన పడకుండా చూడవలసిన బాధ్యత ప్రతి ఒక్కరి పైన ఉందని అన్నారు. యువత అభివృద్ధి దేశ అభివృద్ధి అని యువత అన్ని రంగాలలో రాణించడానికి ప్రతి ఒక్కరూ చేయూత ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎదలాపురం నరసింహ చారి, నక్క కొమురెల్లి, నారద చందర్, తాళ్ల చంద్రయ్య, ఆర్సి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# అమ్మవారిపేట జాతర ఏర్పాట్లపై సమీక్ష

**- భక్తుల భద్రతే లక్ష్యంగా పటిష్ట బందోబస్త్**

**- సెంట్రల్ జోన్ డీసీపీ దార కవిత**

**- 28 నుంచి 31తేదీల్లో జాతర**



**వేద న్యూస్, అమ్మవారిపేట:**

ఈ నెల 28 నుంచి 31 తేదీల్లో మడికొండ పోలీస్ స్టేషన్ పరిధిలోని అమ్మవారిపేట గ్రామంలో శ్రీ మేడారం జాతర జరగనుంది. దీనికి సంబంధించిన భద్రత, బందోబస్త్, రక్షణ ఏర్పాట్లను వరంగల్ పోలీస్ కమిషనరేట్ సెంట్రల్ జోన్ డీసీపీ దార కవిత స్వయంగా పరిశీలించారు. నాలుగు రోజుల పాటు ఘనంగా జరిగే ఈ జాతర సందర్భంగా ఏ కార్యక్రమాలు నిర్వహించనున్నాయి, భక్తుల సంఖ్య ఎంత మేరకు ఉండే అవకాశం ఉంది, యాత్రికులకు కల్పించాల్సిన మౌలిక వసతులు, గతంలో ఏవైనా అనుకోని సంఘటనలు చోటుచేసుకున్నాయా వంటి అంశాలపై జాతర కార్యవర్గ సభ్యుల నుంచి డీసీపీ వివరాలు తెలుసుకున్నారు. అలాగే ప్రతి విభాగం చేపడుతున్న బాధ్యతలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ.. అమ్మవారిపేట గ్రామంలో స్వయంభూగా వెలసిన సమ్మక్క-సారలమ్మలను దర్శించుకోవడం ఆనందంగా ఉందన్నారు. ఈసారి జాతరకు పటిష్టమైన పోలీస్ బందోబస్త్ ఏర్పాటు చేస్తున్నామని, భక్తులకు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా క్యూ లైన్లు, ట్రాఫిక్ నియంత్రణ, నిఘా చర్యలు చేపట్టి జాతరను శాంతియుతంగా నిర్వహించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ సమీక్షలో డీసీపీతో పాటు కాజీపేట ఏసీపీ ప్రశాంత్ రెడ్డి, మడికొండ ఇన్స్పెక్టర్ పుల్యాల కిషన్, ఎస్సైలు రాజబాబు, రాజకుమార్, పోలీస్ సిబ్బంది, స్థానిక 44వ డివిజన్ కార్పొరేటర్ జలగం అనిత రంజిత్, ఆలయ చైర్మన్ కోడూరి భిక్షపతి, జాతర కమిటీ సభ్యులు, స్థానికులు పాల్గొన్నారు.

# కొత్త రేషన్ షాప్ మంజూరు చేయాలి

**- ప్రజావాణి కార్యక్రమంలో ఎంపీడీవోకు వినతి**

**వేద న్యూస్, మందమర్రి:**



మందమర్రి మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమం లో శంకర్పల్లి గ్రామానికి నూతన రేషన్ షాప్ మంజూరు చేయాలని వార్డు సభ్యుడు తిరుపతి ఎంపీడీవోకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా తిరుపతి మాట్లాడుతూ.. ప్రస్తుతం సారంగపెల్లి గ్రామంలో ఉన్న రేషన్ షాప్ శంకర్పల్లి గ్రామానికి చాలా దూరంగా ఉండటంతో వృద్ధులు, మహిళలు, దివ్యాంగులు రేషన్ సరుకులు తీసుకోవడంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొం టున్నారని తెలిపారు. పౌర సరఫరాల శాఖ ద్వారా అందించే ఉచిత సరుకులు సకాలంలో అందా లంటే తమ గ్రామానికి ప్రత్యేక రేషన్ షాప్ మంజూరు చేయాలని కోరినట్లు తెలిపారు. గ్రామ ప్రజల సౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకొని అధికారులు సానుకూలంగా స్పందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# సంక్రాంతికి ఊరెళ్లేవారు అప్రమత్తంగా ఉండాలి

**- రామకృష్ణాపూర్ ఎస్సై భూమేష్**




**వేద న్యూస్, రామకృష్ణపూర్:**

సంక్రాంతి పండుగ సందర్భంగా సెలవుల కు ఊరెళ్లే ప్రజలు ఇళ్లకు తాళం వేసి వెళ్లేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని రామ కృష్ణపూర్ పట్టణ ఎస్సై భూమేష్ సూచిం చారు. సోమవారం పోలీస్ స్టేషన్ ఆవరణ లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. దొంగతనాల నియంత్రణకు పోలీస్ శాఖ అన్ని చర్యలు చేపట్టిందని, పట్టణంలో సిబ్బంది నిత్యం గస్తీ నిర్వహిస్తున్నారని తెలిపారు. అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్‌కు లేదా డయల్ 100కు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఇళ్లకు తాళం వేసి వెళ్లే ముందు విలువైన వస్తువులను బ్యాంక్ లాకర్లలో భద్రపరచడం, సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం, అవసరమైతే పోలీసులకు ముందుగా సమాచారం ఇవ్వడం వంటి జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్సై తెలిపారు.

# యువజన సంఘాలకు క్రీడా సామగ్రి పంపిణీ

**- కేంద్ర మంత్రి బండి సంజయ్, కలెక్టర్ చేతుల మీదుగా అందజేత**

**వేద న్యూస్, చొప్పదండి:**



స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని మై భారత్ కరీంనగర్ ఆధ్వర్యంలో కరీంనగర్‌లోని కళాభారతి వేదికగా నిర్వహించిన కార్యక్రమంలో చొప్పదండి మండలంలోని యువజన సంఘాలకు క్రీడా సామగ్రిని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కుమార్, జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి చేతుల మీదుగా యువజన సంఘాల ప్రతినిధులకు క్రీడా సామగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా యువతను క్రీడల్లో ప్రోత్సహించడమే లక్ష్యంగా ప్రభుత్వం, మై భారత్ సంస్థలు పనిచేస్తున్నాయని వారు పేర్కొన్నారు. స్వామి వివేకానంద బోధనలను ఆదర్శంగా తీసుకుని యువత శారీరక దృఢత్వంతో పాటు మానసికంగా బలంగా ఎదగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డివైఓ రాంబాబు, చల్లా అనూష్, జాగిరి సాయిగణేష్, సంగ నరేష్, తాడూరి శివకృష్ణ, అనుకారి సాయికృష్ణ, కోటేష్, రాజేంద్ర, ఆకాష్, జిట్టా కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# పందెం కోఢ్!

- □ తెలుగు రాష్ట్రాల్లో కోడి పందేలు షురూ
- □ ఆంధ్రాలో మూడు రోజుల్లోనే వందల కోట్ల వ్యాపారం

- □ మినీ స్టేడియాలను తలపించేలా భారీ ఏర్పాట్లు
- □ ఫ్లడ్ లైట్ల వెలుతురులో రాత్రింబవళ్లు నిర్వహణ
- □ అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా..
- □ పందేలకు లీడర్ల సహకారం
- □ పొలిటీషియన్లు, బడాబాబుల కు గమ్మత్తు ఆట
- □ తెలంగాణ నుంచి సైతం భారీగా వెళ్తున్న పందెంరాయుళ్లు
- □ ఇప్పటికే హొటళ్లు, లాడ్జీలన్నీ బుక్
- □ కోడి పందేలు వద్దంటూ తాజాగా ఏపీ హైకోర్ట్ ఆదేశాలు



**వేద న్యూస్, ప్రత్యేక ప్రతినిధి:**

తెలుగు లోగిళ్లలో సంక్రాంతి సందడి మొదలైంది. పిండి వంటల ఘుమఘుమలు, హరిదాసుల కీర్తనల కంటే ఎక్కువగా కోస్తా ఆంధ్రలో కోడి పందెం కత్తి నూరుతోంది. ప్రతి ఏటా వివాదాలు, కోర్టు ఆంక్షలు, పోలీసుల హెచ్చరికలు ఉన్నప్పటికీ, క్షేత్రస్థాయిలో పరిస్థితి మాత్రం అందుకు భిన్నంగా కనిపిస్తోంది. ఒకప్పుడు గ్రామీణ వినోదంగా కనిపించిన ఈ ఆచారం, ఇప్పుడు కోట్ల రూపాయలు చేతులు మారే అక్రమ జూదంగా, అంతర్‌రాష్ట్ర నెట్‌వర్క్‌గా రూపాంతరం చెందింది. కేవలం వినోదం కోసం మొదలైన ఈ ఆట ఇప్పుడు వందల కోట్ల రూపాయల వ్యాపారంగా, రాజకీయ నాయకుల పరపతికి పరీక్షగా మారిపోయింది. ముఖ్యంగా ఉమ్మడి గోదావరి, కృష్ణా, గుంటూరు జిల్లాల్లో ఈసారి పందేల నిర్వహణ సరికొత్త పుంతలు తొక్కుతోంది. ఇక తెలంగాణలోని సరిహద్దు గ్రామాలతో పాటు గ్రామ శివార్లలో సైతం కోడి పందేల నిర్వహణకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. గతంలో పొలాల్లో చాటుమాటుగా జరిగే పందేలు ఇప్పుడు బహిరంగంగానే భారీ స్టేడియంలను తలపించేలా ఏర్పాటవుతున్నాయి.

**– ఫ్లడ్ లైట్ల వెలుతురులో భారీ ఏర్పాట్లు..**

ఎకరాల కొద్దీ ఖాళీ స్థలాలను చదును చేసి, పక్కాగా గ్యాలరీలు నిర్మించి, ఫ్లడ్ లైట్ల వెలుతురులో అహోరాత్రులు పందేలు నిర్వహించేందుకు నిర్వాహకులు సకల సౌకర్యాలు చేశారు. ఈ బరుల్లోకి అడుగు పెట్టాలంటే సాధారణ ప్రజలకు అవకాశం ఉండదు. ప్రత్యేక టోకెన్లు, పాసులు ఉన్నవారికే లోపలికి అనుమతి. బయట వాలంటీర్లు, లోపల ప్రైవేట్ భద్రతా సిబ్బంది. పోలీసుల కదలికలపై ముందస్తు సమాచారం అందించే వ్యక్తులు కూడా ఉంటారు. ఒక్కసారిగా దాడి జరిగితే క్షణాల్లో బరిని ఖాళీ చేసేలా పకడ్బందీ ఏర్పాట్లు ఉంటాయని నిర్వాహకులు చెప్పడం గమనార్హం. ఇది చూసినప్పుడు కోడి పందేలు ఒక ఆటగా కాకుండా, పక్కా ప్రణాళికతో నడిచే అక్రమ వ్యాపారంలా అనిపిస్తుందని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.



**– లక్షల్లో మొదలై.. కోట్ల వరకు..!**

పందేల కోసం సిద్ధం చేసే కోళ్ల పెంపకం ఒక పెద్ద ప్రహసనంలా సాగుతోంది. ఒక్కో పందెం కోడికి ఆరు నెలల ముందు నుంచే బాదం, పిస్తా, ఖర్జూరం వంటి పోషకాహారంతో పాటు ప్రత్యేక శిక్షణ ఇస్తారు. ఒక్కో కోడి విలువ లక్షల్లో పలుకుతుండగా, పందెం గెలిస్తే వచ్చే గౌరవం కోసం బడా బాబులు ఎంతైనా ఖర్చు చేసేందుకు వెనుకాడటం లేదు. గెలిచిన పందెం కోడి యజమానికి అది ఒక స్టేటస్ సింబల్ గా మారిపోయింది. లక్షల్లో మొదలయ్యే పందేలు, క్షణాల్లో కోటికి చేరుతాయి. ఒక కోడి మీద లక్షలు, మరో కోడి మీద కోట్లు. గెలిచినవాడు అదే బరిలో మరింత భారీగా మళ్లీ పందెం కాస్తాడు. గెలిస్తే వచ్చే కిక్ వేరు అన్న భావనతో ఎంతకైనా తెగించే ధోరణి పెరిగింది.

**– తెలంగాణ నుంచీ భారీగా పందెం రాయుళ్లు**

ఈ పందేల కోసం ఆంధ్రప్రదేశ్‌కే పరిమితం కాకుండా తెలంగాణ నుంచి పెద్ద ఎత్తున జనాలు పయనం అవుతున్నారు. తెలంగాణలోని హైదరాబాద్ నుండి వేలాది మంది ఐటీ ఉద్యోగులు, వ్యాపారవేత్తలు ఇప్పటికే ఆంధ్రాకు పయనమయ్యారు. సరిహద్దు గ్రామాల్లో భద్రత కట్టుదిట్టం చేసినట్లు పోలీసులు చెప్తున్నా, లోపాయికారీగా పందేలు నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. హైదరాబాద్, వరంగల్, ఖమ్మం, సరిహద్దు మండలాల నుంచి వందలాది వాహనాలు సంక్రాంతి రోజుల్లో ఆంధ్రా వైపు కదులుతుంటాయి. తెలంగాణలోనూ సరిహద్దు గ్రామాల్లో పందేలు జరుగుతున్నప్పటికీ, భారీ మొత్తాల పందేల కోసం మాత్రం ఆంధ్రాలోని ప్రధాన బరులే గమ్యస్థానంగా మారాయి. కేవలం రెండు రాష్ట్రాలే కాకుండా కర్ణాటక, తమిళనాడు నుంచి సైతం సినీ సెలెబ్రిటీలు, రాజకీయ ప్రముఖులు ఏపీకి క్యూ కడుతుండటంతో స్టార్ హొటళ్లు, రిసార్టులు ఇప్పటికే నిండిపోయాయి.

**– పందేలు వద్దంటూ ఏపీ హైకోర్ట్ ఆదేశాలు**

మరోవైపు.. ఆంధ్రప్రదేశ్ హైకోర్టు జంతు బలిని, కత్తులు కట్టి పందేలు వేయడాన్ని కఠినంగా నిరోధించాలని ఆదేశించినా, పండగ సంప్రదాయం పేరుతో నిర్వాహకులు ముందుకు వెళ్తున్నారు. పందేల ముసుగులో గుండాట, పేకాట వంటి ఇతర జూదాలు కూడా విచ్చలవిడిగా సాగుతుండటంతో మూడు రోజుల్లో వేల కోట్ల రూపాయలు చేతులు మారుతాయని మార్కెట్ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. చట్టపరంగా చూస్తే కోడి పందేలు స్పష్టమైన నేరం. జంతు క్రూరత్వం, అక్రమ జూదం కింద వస్తాయి. ఆంధ్రప్రదేశ్ హైకోర్టు కోడి పందేల నిర్వహణను నిషేధిస్తూ స్పష్టమైన ఆదేశాలు ఇచ్చింది. పోలీస్ శాఖ, జిల్లా యంత్రాంగం ప్రతి ఏటా హెచ్చరికలు జారీ చేస్తూనే ఉన్నాయి. దాడులు జరుగుతున్నాయి, కేసులు నమోదు అవుతున్నాయి. అయినా నిర్వాహకుల మాట మాత్రం ఇది దశాబ్దాలుగా వస్తున్న సంస్కృతి. ఒక్కసారిగా ఆపడం సాధ్యం కాదని చెప్పడం గమనార్హం.



## నిట్‌లో ఘనంగా సంక్రాంతి సంబురాలు

**వేద న్యూస్ హనుమకొండ:**

వరంగల్ నిట్ క్యాంపస్‌లో సంక్రాంతి సంబురాలు ఘనంగా నిర్వహించారు. ఒకే వేదికపై భారతదేశంలోని వివిధ రాష్ట్రాల సాంస్కృతిక సంప్రదాయాలను కలిపి సంక్రాంతి, పొంగల్, బిహు, లాహిరి ఉత్సవాలను కన్నుల పండువగా నిర్వహించారు. ఈ కార్యక్రమం భిన్నత్వంలో ఏకత్వం స్ఫూర్తిని ప్రతిబింబిస్తుంది, విద్యార్థుల నుంచి ఉత్సాహభరితమైన భాగస్వామ్యాన్ని చూసిందపి డీన్ ప్రొఫెసర్ కిరణ్ కుమార్, ప్రొఫెసర్ పెరుగు శ్యామ్తో అన్నారు. వేడుకల్లో భాగంగా విద్యార్థులకు రంగోలి తయారీ, గాలిపటాల తయారీ, ఎగరడం, టగ్-ఆఫ్-వార్, పరుగు పందాలు, సాంప్ర్ దాయ దుస్తుల పోటీలు, పొంగల్ తయారీ వంటి వివిధ రకాల పోటీలను నిర్వహించారు. విజేతలకు వారి పనితీరు, సృజనాత్మ కతకు గుర్తింపుగా బహుమతులు ప్రదానం చేశారు. ఉత్సా హభరితమైన వాతావరణాన్ని పెంచుతూ లాంతరు పోటీలతో సాయంత్రం వరకు ఉత్సవాలు కొనసాగాయి. సాంప్రదాయ సంక్రాంతి వంటకాలు కూడా విద్యార్థులకు పంపిణీ చేశారు. అనేక స్టాళ్లు, సెల్ఫీ పాయింట్లు ఆకర్షణీయంగా నిలిచాయి.

వేద న్యూస్ తెలుగు దినపత్రిక -2026 క్యాలెండర్ ను ఆవిష్కరిస్తున్న దేవునూరు గ్రామ సర్పంచ్ హింగే రవీందర్, బీఆర్ఎస్ ధర్మసాగర్ మండల యూత్ నాయకుడు, పల్లా వీరాభిమాని దేవునూరు జీపీ వార్డు మెంబర్ గ్యారంపల్లి పవన్





## దివ్యాంగులు ఆత్మగౌరవంతో నిలబడాలి

కార్యక్రమంలో భాగంగా బాలల సంరక్షణ కోసం బాల భరోసా కార్యక్రమాన్ని ప్రారంభించారు. అలాగే వయోవృద్ధుల సంక్షేమం కోసం ప్రణామ్ పేరుతో డే--కేర్ సెంటర్లను వర్చువల్‌గా ప్రారంభించారు. దేశంలోనే తొలిసారిగా ప్రభుత్వం కుటుంబ పెద్దగా మారి వృద్ధులకు భరోసా ఇచ్చే కార్యక్రమమిదని పేర్కొన్నారు. విద్య, ఉద్యోగాల్లో దివ్యాంగులకు రిజర్వేషన్లు కల్పిస్తున్నామని, దివ్యాంగులు-దివ్యాంగులు వివాహం చేసుకుంటే రూ.2 లక్షల ఆర్థిక సహాయం అందిస్తామని సీఎం తెలిపారు. ప్యారా ఒలింపిక్స్‌లో రాణించిన క్రీడాకారిణికి ఉద్యోగం ఇచ్చామని గుర్తు చేశారు. అలాగే ట్రాన్స్‌జెండర్లకు ప్రభుత్వ ఉద్యోగాలు, ఇందిరమ్మ ఇండ్ల కేటాయింపుతో పాటు మున్సిపల్ కార్పొరేషన్లలో కో-ఆప్షన్ సభ్యులుగా నామినేషన్ ఇవ్వాలన్న ఆలోచన ఉందని, దీనిపై మంత్రివర్గ సమావేశంలో నిర్ణయం తీసుకోవాలని సూచించారు. తెలంగాణలో పేదలకు వందశాతం వైద్య సహాయం అందించే దిశగా సమగ్ర హెల్త్ పాలసీ తీసుకొస్తామని, కులగణన, ఎస్సీ వర్గీకరణ వంటి చారిత్రక నిర్ణయాలతో సామాజిక న్యాయానికి బలమైన పునాది వేశామని సీఎం తెలిపారు. 2026 జనగణనలో తెలంగాణ మోడల్ దేశానికి ఆదర్శంగా నిలుస్తుందని చెప్పారు. 'ఇంకా చేయాల్సింది చాలా ఉంది. ప్రణాళికాబద్ధంగా తెలంగాణను ఆర్థికంగా అభివృద్ధి చెందిన, పేదలకు అండగా నిలిచే రాష్ట్రంగా తీర్చిదిద్దడమే మా సంకల్పం' అని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు దామోదర రాజనర్సింహ, ధనసరి అనసూయ సీతక్క, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తదితర ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## ప్రజావాణి దరఖాస్తులు పెండింగ్‌లో ఉండకూడదు

- త్వరిత పరిష్కారానికి అధికారులకు కలెక్టర్ ఆదేశాలు
- అటల్ పెన్షన్ యోజనలో 107 శాతం నమోదు
- జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్‌కు సన్మానం

**వేద న్యూస్ నిర్మల్ :**





ప్రజల నుండి ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచకుండా, నిర్ణీత గడువులోగా త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. ప్రజల సమస్యల పరిష్కారంలో జాప్యం ఉండకూడదని, బాధ్యతతో వ్యవహరించాలని స్పష్టం చేశారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ స్వయంగా పాల్గొని ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. ప్రతి దరఖాస్తును సంబంధిత శాఖలు సమన్వయంతో పరిశీలించి, వాస్తవ పరిష్కారాలు అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ప్రజావాణి అనేది కేవలం వినడానికే కాకుండా సమస్యలకు పరిష్కారం చూపే వేదికగా మారాలని కలెక్టర్ అభిప్రాయపడ్డారు. అనంతరం కేంద్ర ప్రభుత్వ పథకమైన అటల్ పెన్షన్ యోజన అమలులో నిర్మల్ జిల్లా 107 శాతం నమోదు సాధించిన సందర్భంగా జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ రామ్ గోపాల్ను కలెక్టర్ శాలువాతో సన్మానించి అభినందించారు. జిల్లా యంత్రాంగం, బ్యాంకుల సమన్వయంతోనే ఈ విజయం సాధ్యమైందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, ఆర్డీఓ రత్నకళ్యాణితో పాటు వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు. ప్రజల సమస్యలపై స్పందిస్తూ పారదర్శకమైన పాలన అందించడమే ప్రభుత్వ లక్ష్యమని అధికారులు ఈ సందర్భంగా తెలిపారు.

## సివిల్ సూట్ణ సరైన మార్గం



విచారణ అర్హత లేదని స్పష్టం చేసిన ధర్మాసనం, ఇతర ప్రత్యామ్నాయ న్యాయ మార్గాల ద్వారా పరిష్కారం పొందవచ్చని తెలిపింది. ఈ సందర్భంగా తెలంగాణ ప్రభుత్వ తరఫున వాదించిన సీనియర్ న్యాయవాది అభిషేక్ సింఘ్వి, తమ రిట్ పిటిషన్‌ను ఉపసంహరించు కుంటున్నట్లు కోర్టుకు తెలియ జేశారు. దీనికి అనుమతి ఇచ్చిన సుప్రీంకోర్టు, నీటి కేటాయింపులు, ఉల్లంఘనలపై వివాదాల పరిష్కారానికి సివిల్ సూట్ సరైన మార్గమని వ్యాఖ్యానించింది. గోదావరి నది జలాల విషయంలో కేవలం తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ మాత్రమే కాకుండా మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల వాదనలు కూడా వినాల్సి ఉంటుందని ధర్మాసనం స్పష్టం చేసింది. అందుకే అన్ని పక్షాల వాదనలు సమగ్రంగా పరిశీలించేందుకు సివిల్ సూట్ దాఖలు చేయాలని సూచించింది. దీనితో తెలంగాణ ప్రభుత్వం రిట్ పిటిషన్‌ను అధికారికంగా ఉపసంహరించుకుని, త్వరలో సివిల్ సూట్ ఫైల్ చేస్తామని సుప్రీంకోర్టుకు తెలియజేసింది. గోదావరి జలాల కేటాయింపులు, ప్రాజెక్టుల నిర్మాణం, రాష్ట్రాల మధ్య హక్కుల అంశాలపై ఇకపై న్యాయపోరాటం సివిల్ సూట్ రూపంలో కొనసాగనుందని న్యాయవర్గాలు విశ్లేషిస్తున్నాయి.

## క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించిన మాదాపూర్ డీసీపీ

- క్రీడాకారులకు టీషర్టు అందజేత



**వేద న్యూస్, కమలాపూర్:**

హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలం ఉప్పల్ గ్రామంలో ధర్మల నాగరాజు స్మారకార్థం నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్‌ను మాదాపూర్ డీసీపీ పుల్ల శోభన్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ప్రారంభ మ్యాచ్ అయిన శ్రీరాముల పల్లె వర్సెస్ ఉప్పల్ జట్ల మధ్య జరిగిన పోటికి టాస్ వేసి, తొలి ట్రయల్ బాల్ బ్యాటింగ్ చేసి టోర్నమెంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రీడాకారులను ప్రోత్సహిస్తూ టీషర్ట్లను కూడా ఆయన స్పాన్సర్ చేశారు. ఈ టోర్నమెంట్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ ఎర్రబెల్లి శ్రీధర్ రావు, టీఆర్ఎస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు జక్కుల రాజు, 10వ వార్డు సభ్యులు తూర్పాటి భాస్కర్, 13వ వార్డు సభ్యులు కొయ్యడ స్రవంతి రాజు, తూర్పాటి ఉపేందర్, అలుగు రాజు, బొల్లి శ్రీను, క్రీడాకారులు, ఉప్పల్ గ్రామస్తులు పాల్గొన్నారు.

## తాటిగూడలో వివేకానంద జయంతి

**వేద న్యూస్, కాసిపేట:**



మంచిర్యాల జిల్లా కాసిపేట మండలంలోని తాటిగూడ గ్రామంలో స్వామి వివేకానంద జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. గ్రామ యువతతో కలిసి వివేకానంద చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా తాటిగూడ గ్రామ సర్పంచ్ మడావి వెంకటేష్ మాట్లాడుతూ.. భారతదేశం గర్వించదగ్గ మహాపురుషుడు, యువతకు శాశ్వత స్ఫూర్తి స్వామి వివేకానంద అని కొనియాడారు. ఆయన జన్మదినాన్ని దేశవ్యాప్తంగా జాతీయ యువజన దినోత్సవంగా జరుపుకుంటున్నామని తెలిపారు. గ్రామ యువత స్వామి వివేకానంద బోధించిన ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణను అలవరుచుకుని, వ్యసనాలకు దూరంగా ఉంటూ గ్రామ అభివృద్ధిలో చురుగ్గా పాల్గొనాలని సర్పంచ్ కోరారు. ఈ కార్యక్రమంలో ఏకలవ్య యూత్ కమిటీ సభ్యులు మడావి రాజేష్, వెలది అర్జు, వెలది శంకర్, మడావి బీర్సావ్, మడావి అర్జున్, వెలది రఘు తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## పార్టీ బలోపేతం కోసం కృషిచేస్తా

- జిల్లా కార్యదర్శిగా రెండోసారి నియామకం - గోకె వెంకటేశ్



**వేద న్యూస్, వరంగల్:**

భారతీయ జనతా పార్టీ వరంగల్ జిల్లా కార్యదర్శిగా రెండోసారి గోకె వెంకటేష్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ...తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించినందుకు జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్కు నా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు.. అలాగే ఈ అవకాశం కల్పించడంలో సహకరించిన ప్రదీప్ రావు, కుసుమ సతీష్, రత్నం సతీష్ షా, బాకం హరిశంకర్‌తో పాటు జిల్లా స్థాయి నాయకులందరికీ ప్రత్యేక ధన్యవాదాలు చెప్పారు. పార్టీ తనపై ఉంచిన విశ్వాసానికి తగిన విధంగా, వరంగల్ జిల్లాలో భారతీయ జనతా పార్టీ బలోపేతం కోసం అహర్నిశలు కృషి చేస్తానని స్పష్టం చేశారు. కార్యకర్తలతో సమన్వయం పెంచుతూ, పార్టీ సిద్ధాంతాలు ప్రజల్లోకి తీసుకెళ్లి, ప్రజా సమస్యల పరిష్కారానికి చురుగ్గా పనిచేస్తానని ఈ సందర్భంగా పేర్కొన్నారు. పార్టీ అభివృద్ధి, కార్యకర్తల గౌరవం, ప్రజల ఆశీస్సులు సాధించడమే నా లక్ష్యంగా ముందుకు సాగుతానని గోకె వెంకటేష్ తెలిపారు.

## ప్రవీణ్ మృతదేహాన్ని స్వగ్రామానికి తరలించాలి

- విదేశాంగ శాఖతో మాట్లాడిన ఎంపీ బండి సంజయ్ కుమార్
- కుటుంబానికి ప్రగాఢ సానుభూతి



**వేద న్యూస్, రాజన్న సిరిసిల్ల:**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండల కేంద్రానికి చెందిన మేకల ప్రవీణ్ అనే యువకుడు ఉపాధి కోసం ఆరు నెలల క్రితం యూరప్ దేశమైన ఆర్మేనియాకు వెళ్లి, రెండు రోజుల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన విషయం తెలిసిందే. ప్రవీణ్ మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకువచ్చేలా చర్యలు చేపట్టాలని కుటుంబ సభ్యులు కోరడంతో, కరీంనగర్ పార్లమెంట్ సభ్యులు, కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ వెంటనే స్పందించారు. ఈ విషయమై విదేశాంగ శాఖ అధికారులతో మాట్లాడి, వీలైనంత త్వరగా మృతదేహాన్ని స్వగ్రామానికి తరలించే ఏర్పాట్లు చేయాలని కోరినట్లు తెలిపారు. ఈ సందర్భంగా బండి సంజయ్ కుమార్ ప్రవీణ్ కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, బాధిత కుటుంబానికి పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని భరోసా ఇచ్చారు.

## ఉత్సాహంగా పోలీస్-ప్రెస్ ఫ్రెండ్లీ క్రికెట్ మ్యాచ్

**వేద న్యూస్, శాయంపేట:**



శాయంపేట పోలీస్ స్టేషన్ సిబ్బంది-ప్రెస్ జట్ల మధ్య సోమవారం పత్తిపాక శివారు గ్రౌండ్‌లో స్నేహపూర్వక క్రికెట్ మ్యాచ్ ఉత్సాహంగా జరిగింది. ఈ మ్యాచ్‌లో పోలీస్ జట్టు విజయం సాధించింది. ఏసీపీ, సీఐ, ఎస్సైలు బ్యాటింగ్‌తో ప్రేక్షకులను అలరించారు. మ్యాచ్ అనంతరం పరకాల ఏసీపీ సతీష్ బాబు మాట్లాడుతూ.. పని ఒత్తిడిలో ఉండే పోలీసులు, జర్నలిస్టుల మధ్య ఇలాంటి ఫ్రెండ్లీ మ్యాచ్‌లు సానుకూల వాతావరణాన్ని పెంపొందిస్తాయని అన్నారు. క్రీడాస్ఫూర్తితో మ్యాచ్ ఉత్కంఠభరితంగా సాగిందని పేర్కొన్నారు. విజేత జట్టుకు, రన్నర్ జట్టుకు బహుమతులు అందించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో శాయంపేట సీఐ రంజిత్ రావు, ఆత్మకూరు-పరకాల సీఐ క్రాంతి కుమార్, శాయంపేట ఎస్సై జక్కుల పరమేష్, పరకాల ఎస్సై రమేష్, దామెర ఎస్సై కొంక అశోక్, ఆత్మకూరు ఎస్సై తిరుపతి, పోలీస్ సిబ్బంది, శాయంపేట మండల రిపోర్టర్లు పాల్గొన్నారు.

## బాల కార్మిక వ్యవస్థపై ఉక్కుపాదం

- చిన్నారులను బడులకు పంపేలా ప్రోత్సహించాలి
- ఆపరేషన్ స్మైల్‌లో జిల్లా వ్యాప్తంగా 28 కేసులు నమోదు
- మెదక్ జిల్లా అదనపు ఎస్పీ మహేందర్




**వేద న్యూస్, మెదక్:**

బాల్యం పూర్తిగా విద్యకు అంకితం కావాలని, వారు కార్మికులుగా లేదా కర్షకులుగా పని చేయరాదని మెదక్ జిల్లా అదనపు ఎస్పీ మహేందర్ స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా జనవరి 1 నుంచి ప్రారంభమైన ఆపరేషన్ స్మైల్ కార్యక్రమం మెదక్ జిల్లాలో అన్ని శాఖల సమన్వయంతో విజయవంతంగా కొనసాగుతోందని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా పోలీస్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన సమన్వయ సమావేశంలో అదనపు ఎస్పీ పాల్గొని కీలక సూచనలు చేశారు. హోటళ్లు, ఇటుక బట్టీలు, నిర్మాణ పనులు, వ్యాపార సముదాయాలలో పనిచేస్తున్న బాల కార్మికులను గుర్తించి వారిని తల్లిదండ్రులకు అప్పగించడంతో పాటు, అవసరమైతే సంరక్షణ గృహాలకు తరలించాలని ఆదేశించారు. బాల కార్మికులను పనిలో పెట్టుకున్న యజమానులపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఇప్పటివరకు జిల్లాలో 26 మంది బాలలను రక్షించి తల్లిదండ్రులకు అప్పగించామని, మరో 9 మంది పిల్లలను సంరక్షణ కేంద్రాలకు తరలించినట్లు తెలిపారు. బాల కార్మిక వ్యవస్థకు సంబంధించిన కేసులుగా జిల్లావ్యాప్తంగా మొత్తం 28 కేసులు నమోదు చేసినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమం నెల రోజుల పాటు కొనసాగుతుందని, ప్రతిరోజూ జిల్లాలోని అన్ని మండలాలు, గ్రామాల్లో తనిఖీలు చేపట్టి బాల కార్మికులను గుర్తించి చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో సీఐటీయూ ఇన్స్పెక్టర్ రాజశేఖర్ రెడ్డి, డీసీఆర్బీ ఇన్స్పెక్టర్ కృష్ణమూర్తి, వివిధ శాఖల అధికారులు, ఎన్‌జీవోలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## కార్మెల్ అకాడమీలో వార్షిక క్రీడోత్సవాలు

**వేద న్యూస్, మందమర్రి:**

- మహిళలకు ముగ్గుల పోటీలు




మందమర్రి పట్టణంలోని కార్మెల్ అకాడమీలో సోమవారం వార్షిక క్రీడోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కార్మెల్ ఎడ్యుకేషనల్ ప్రెసిడెంట్ సిస్టర్ మారియా అగాస్టీన్ ముఖ్య అతిథిగా హాజరై క్రీడాజ్యోతిని వెలిగించి పోటీలను ప్రారంభించారు. క్రీడోత్సవాల్లో భాగంగా 800, 400, 200 మీటర్ల పరుగు పందాలు, షార్ట్ ఫుడ్ రిలే పోటీలు నిర్వహించి విద్యార్థుల్లో క్రీడాస్ఫూర్తిని పెంపొందించారు. ఈ సందర్భంగా 1998 సెప్టెంబర్ 26న పీఈటీగా విధుల్లో చేరి, విద్యార్థుల్లో క్రీడల పట్ల ఆసక్తి, క్రమశిక్షణ, శారీరక దృఢత్వం పెంపొందించిన ఉపాధ్యాయుడు కే. అమర్ పదవీ విరమణ సందర్భంగా శాలువా, కిరీటం ధరింపజేసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ ఫాదర్ జేవీఆర్ రెక్స్ మాట్లాడుతూ.. వార్షిక క్రీడలు, సంక్రాంతి పండుగ, పదవీ విరమణ సన్మానాలను సమన్వయపరిచి కార్యక్రమాలు నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. క్రీడల ద్వారా విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, పట్టుదల పెరుగుతాయని, ఓటమి కూడా విజయంలో భాగమేనని వివరించారు. ముందస్తు సంక్రాంతి పండుగను పురస్కరించుకొని విద్యార్థుల తల్లులకు రంగురంగుల ముగ్గుల పోటీలు నిర్వహించగా, పాఠశాల ప్రాంగణం పండుగ కళతో కళకళలాడింది. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ఉపాధ్యాయినులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## శబరి యాత్రకు బయలుదేరిన అయ్యప్ప భక్తులు

**వేద న్యూస్, వరంగల్ టౌన్:**



కరీమాబాద్ శ్రీ సీత రామస్వామి అయ్యప్ప భక్త మండలి ఆధ్వర్యంలో అయ్యప్ప స్వామి భక్తులు భక్తిశ్రద్ధలతో 41 రోజుల దీక్షను విజయవంతంగా పూర్తి చేసుకున్నారు. ఈ సందర్భంగా సోమవారం ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించి, ఇరుముడి ధరణ చేసి శబరి యాత్రకు బయలుదేరారు. అయ్యప్ప స్వామి నామస్మరణతో పాటు భజనలు, మంత్రోచ్చారణల మధ్య కార్యక్రమం ఆధ్యాత్మిక వాతావరణంలో సాగింది. దీక్షాదారులు దీక్షా నియమాలను కట్టుదిట్టంగా పాటిస్తూ, ఐకమత్యంతో శబరి యాత్రను ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి స్థానిక అయ్యప్ప భక్తులు, మండలి సభ్యులు పెద్ద సంఖ్యలో హాజరై యాత్రికులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మండలి ప్రతినిధులు మాట్లాడుతూ, అయ్యప్ప స్వామి కృపతో ప్రతి భక్తుడి కోరికలు నెరవేరాలని, యాత్ర సుఖసాంత్వనాలతో పూర్తవాలని ఆకాంక్షించారు. భక్తులందరూ శబరి మలై దర్శనం అనంతరం స్వగ్రామాలకు సురక్షితంగా చేరుకోవాలని ప్రార్థించారు.

## పండుగల వేళ జర భద్రం..




- ప్రజా భద్రతపై మట్వాడ పోలీసుల అవగాహన
- సంక్రాంతి, మేడారం నేపథ్యంలో ముందస్తు చర్యలు

**వేద న్యూస్, వరంగల్ క్రైం:**

రాబోయే సంక్రాంతి పండుగతో పాటు మేడారం జాతరను దృష్టిలో ఉంచుకుని నేరాల నివారణ, ప్రజా భద్రత లక్ష్యంగా మట్వాడ పోలీస్ స్టేషన్ పరిధిలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పబ్లిక్ అడ్రెసింగ్ సిస్టమ్ అమర్చిన ఆటో ద్వారా ఈ కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజలకు కీలక సూచనలు అందించారు. ఈ సందర్భంగా పండుగల సమయంలో తీసుకోవాల్సిన భద్రతా జాగ్రత్తలపై పోలీసులు వివరించారు. ముఖ్యంగా ఇళ్లకు తాళం వేసి వెళ్లే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, విలువైన వస్తువుల రక్షణ, వ్యక్తిగత భద్రత, జన సమూహాల్లో అప్రమత్తంగా ఉండడం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. అలాగే అనుమానాస్పద వ్యక్తులు లేదా అనుమానాస్పద కార్యకలాపాలు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ప్రజలను కోరారు. ప్రజల సహకారంతోనే నేరాల నివారణ సాధ్యమవుతుందని, ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని పోలీసులు సూచించారు. పండుగల సమయంలో ప్రశాంతమైన వాతావరణం నెలకొనాలనే ఉద్దేశంతో ఈ తరహా అవగాహన కార్యక్రమాలు కొనసాగిస్తామని మట్వాడ పోలీసులు తెలిపారు.

## విద్యుత్ వినియోగదారులకు డిప్యూటీ సీఎం శుభాకాంక్షల లేఖలు

**వేద న్యూస్, వరంగల్:**



తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు ఆదేశాల మేరకు విద్యుత్ పంపిణీ సంస్థలు వినియోగదారులతో సంబంధాలను బలోపేతం చేసే దిశగా వినూత్న కార్యక్రమాన్ని చేపట్టాయి. ఈ కార్యక్రమంలో భాగంగా గృహ జ్యోతి లబ్ధిదారులు, వ్యవసాయ విద్యుత్ వినియోగ దారులకు ఉప ముఖ్యమంత్రి నూతన సంవత్సరం, సంక్రాంతి శుభాకాంక్షల లేఖలను పంపిణీ చేస్తున్నారు. వినియోగదారుల పేరు, సర్వీస్ నంబర్‌తో వ్యక్తిగతంగా అడ్రస్ చేసిన ఈ లేఖలను టీజీఎన్‌పీడీసీఎల్ అధికారులు స్వయంగా ఇళ్లకు వెళ్లి అందజేస్తున్నట్లు సర్కిల్ సూపరిం టెండింగ్ ఇంజనీర్ రాజన్న తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 52.82 లక్షల గృహ జ్యోతి లబ్ధిదారులు, 30.03 లక్షల వ్యవసాయ విద్యుత్ వినియోగదారులకు ఈ లేఖలు అందజేస్తున్నామని చెప్పారు. వినియోగదారులు--అధికారుల మధ్య సత్సంబంధాలు మెరుగుపరచడమే ఈ కార్యక్రమ లక్ష్యమని తెలిపారు. ఉప ముఖ్యమంత్రి గారి నుంచి నేరుగా శుభాకాంక్షల లేఖ అందడంతో వినియోగదారులు ఆనందం వ్యక్తం చేస్తూ, ఇది ప్రజల పట్ల ప్రభుత్వ నిబద్ధతకు నిదర్శనమని అభిప్రాయపడ్డారు.

# పెరుందేవి తాయారు జ్ఞాపకార్థం అన్నదానం, చీరెల పంపిణీ

**- పంచముఖి ఆంజనేయస్వామి దేవాలయంలో కార్యక్రమం**



**వేద న్యూస్, మందమర్రి:**

పంచముఖి ఆంజనేయ స్వామి దేవాలయం ప్రధాన అర్చకులు కృష్ణ చైతన్య ఆచార్య మాతృమూర్తి పెరుందేవి తాయారు 25వ వర్ధంతి జ్ఞాపకార్థం సందర్భంగా సివిక్ కాంట్రాక్టు మహిళా కార్మికులకు చీరెల పంపిణీతో పాటు అన్నదాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. మందమర్రి పట్టణం పాలచెట్టు ఏరియాలోని పంచముఖి ఆంజనేయస్వామి దేవాలయం ఆవరణలో సోమవారం నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఏరియా జనరల్ మేనేజర్ ఎన్. రాధాకృష్ణ, సేవా సమితి అధ్యక్షురాలు శ్రీవాణి, మందమర్రి మండల తహసీల్దార్ సతీష్ కుమార్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ముందుగా స్వామి వివేకానంద 163వ జయంతిని పురస్కరించుకొని చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జనరల్ మేనేజర్ రాధాకృష్ణ మాట్లాడుతూ.. వివేకానంద జయంతి రోజున కృష్ణ చైతన్య తల్లి జ్ఞాపకార్థం మహిళా కార్మికులకు చీరలు పంపిణీ చేయడం, అన్నదానం నిర్వహించడం అభినందనీయమని అన్నారు. యువత వివేకానంద బోధనలను ఆదర్శంగా తీసుకుని సానుకూల ఆలోచనలతో లక్ష్యాల సాధనకు ముందుకు సాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వెంకటేశ్వర స్వామి ఆలయ అర్చకులు అనంతాచార్యులు, శంకర్రావు, పంచముఖి వెల్ఫేర్ సొసైటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

# ఘనంగా హిందూ వాహిని ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

**వేద న్యూస్, కరీమాబాద్ :**



హిందూ వాహిని వరంగల్ జిల్లా ఆధ్వర్యంలో గ్రేటర్ వరంగల్ కరీమాబాద్ లోని హిందూ వాహిని ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. హిందు వాహిని వరంగల్ జిల్లా అధ్యక్షులు ఎర్రగోల్ల చత్రపతి శివాజీ ఆధ్వర్యంలో ఈ యొక్క వేడుకలు జరిగాయి. హిందు వాహిని జెండా ఆవిష్కరించి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో హిందువుగా జీవించడం హిందువుగానే మరణించడం హిందూ సంస్కృతి సాంప్రదాయం పాటించడం కంటే గొప్ప విషయం మరొకటి లేదని అన్నారు. హిందుత్వం అనేది ఒక మతం కాదని అదొక జీవన విధానం అని హిందూ ఆచారాలను పాటించిన వాడు తన జీవితంలో విజయాలను సాధిస్తాడని తెలియజేశారు. అదేవిధంగా హిందువుల జోలికి హిందూ ఆలయాల జోలికి గాని ఎవరైనా వస్తే ఊరుకునే ప్రసక్తే లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వివిధ క్షేత్రాల ప్రముఖులు స్థానిక కార్పొరేటర్ రవి, ఇతర హిందూ వాహిని ప్రవీణ్, జాదవ్, సాగర్, స్థానిక నాయకులు కుసుమ సతీష్, మాచర్ల దీన్ దయాల్, బైరి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# పశువుల గర్భకోశ వ్యాధులకు ఉచిత చికిత్స శిబిరం

**- మైలారం గ్రామంలో పశుసంవర్ధశాఖ ఆధ్వర్యంలో నిర్వహణ**



**వేద న్యూస్, శాయంపేట:**

జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ, పశుసంవర్ధశాఖ ఆధ్వర్యంలో శాయంపేట మండలం మైలారం గ్రామంలో పశువులకు గర్భకోశ వ్యాధులకు ఉచిత చికిత్స శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరాన్ని గ్రామ సర్పంచ్ నూనె దివ్య తిరుపతి ప్రారంభించారు. ఈ సందర్భంగా మండల పశువైద్య అధికారి డా. సునీల్ మాట్లాడుతూ.. రైతులు గోపాలమిత్రుల సేవలను వినియోగించుకోవాలని, పశువులు ఈస్ట్రస్‌కు వచ్చినప్పుడు కృత్రిమ గర్భధారణ చేయించాలని సూచించారు. పశుగ్రాస సాగు చేపట్టడం, దూడలకు నట్టల నివారణ మందులు తప్పనిసరిగా ఇవ్వాలని తెలిపారు. గర్భకోశ వ్యాధుల నివారణకు ఇలాంటి శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ శిబిరంలో మొత్తం 48 పాడి పశువులకు గర్భధారణ పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గోపాలమిత్ర సూపర్వైజర్ ప్రకాష్ రెడ్డి, గోపాలమిత్రులు సుదర్శన్, రంజిత్, సతీష్, ప్రజ్వల్ ప్రతినిధులు అమరేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# బీజేపీ వరంగల్ జిల్లా కార్యదర్శిగా దువ్వ నవీన్

**- రాష్ట్ర నాయకత్వం ఆమోదంతో జిల్లా కమిటీ ప్రకటన**




**వేద న్యూస్, వరంగల్:**

బీజేపీ వరంగల్ జిల్లా సంస్థాగత నిర్మాణంలో భాగంగా మడికొండకు చెందిన దువ్వ నవీన్ను బీజేపీ వరంగల్ జిల్లా కార్యదర్శిగా నియమించారు. రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు, సంస్థాగత ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ తివారి మార్గదర్శకత్వంలో, జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ జిల్లా పదాధికారులను ప్రకటించారు. జాతీయ, రాష్ట్ర నాయకత్వం సూచనలతో పాటు కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ కుమార్, జిల్లా ఇన్‌ఛార్జి కొండపల్లి శ్రీధర్ రెడ్డి మార్గనిర్దేశంతో నూతన వరంగల్ జిల్లా కమిటీ పార్టీ బలోపేతం, కార్యకర్తల సమన్వయం, ప్రజా సమస్యల పరిష్కారానికి కట్టుబడి పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా దువ్వ నవీన్ మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర, జిల్లా నాయకత్వానికి, తన రాజకీయ గురువు అరూరి రమేష్, జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్, రావు పద్మ, కొండేటి శ్రీధర్, సంతోష్ రెడ్డి, మల్లాడి తిరుపతి రెడ్డి, కేశవ రెడ్డి, వన్నాల వెంకట రమణతో పాటు మడికొండ మండల నాయకులు, కార్యకర్తలందరికీ కృతజ్ఞతలు తెలిపారు. వరంగల్ జిల్లాలో పార్టీ బలోపేతానికి అహర్నిశలు కృషి చేస్తానని స్పష్టం చేశారు.

## వాగు నీటిని కలుషితం చేస్తున్న థర్మల్ బూడిద

**- తక్షణ చర్యలు తీసుకోవాలని గ్రామస్తుల డిమాండ్**



**వేద న్యూస్, దామరచర్ల:**

దామరచర్ల మండలంలోని వీర్లపాలెం వద్ద ఉన్న యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ నుంచి వెలువడుతున్న బూడిద అన్నమెరు వాగులో కలుస్తుండటంతో నీరు తీవ్రంగా కలుషితం అవుతోందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వాగు నీటిని మేతకు వెళ్లిన పశువులు తాగితే అనారోగ్యానికి గురయ్యే ప్రమాదం ఉందని, ఈ వాగు కొత్తపల్లి వద్ద కృష్ణానదిలో కలవడంతో నది కూడా కలుషితం అయ్యే అవకాశం ఉందని పేర్కొన్నారు. స్వచ్ఛమైన నీటిని విషతుల్యం చేస్తున్న థర్మల్ ప్లాంట్‌పై గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ, అధికారులు వెంటనే విచారణ చేపట్టి తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

## రోడ్డు దారిపై ఎమ్మెల్యేకు వినతి



**వేద న్యూస్, చొప్పదండి:**

పట్టణంలోని గణేష్ నగర్ నుంచి పీడబ్లూడీ రోడ్డుకు దారి కల్పించాలని కోరుతూ కాలనీ వాసులు చొప్పదండి ఎమ్మెల్యే సత్యంకు వినతిపత్రం అందజేశారు. ఈ రోడ్డునుంచి ఆర్టీసీ బస్టాండ్‌కు వెళ్లే దారి ఉండగా, ప్రస్తుతం అది ఆక్రమణలకు గురవడంతో గణేష్ నగర్ వాసులతో పాటు బాటసారులు కూడా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. గణేష్ నగర్‌కు ఇదే ప్రధాన ముఖద్వారం కావడంతో సమస్యను వెంటనే పరిష్కరించాలని ఎమ్మెల్యేను కోరారు. కాలనీ వాసుల తరఫున ఈ సమస్యను పరిష్కరించి, రాకపోకలకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని వినతిపత్రంలో విజ్ఞప్తి చేశారు.

# బీజేపీ ఆధ్వర్యంలో వివేకానంద జయంతి

**- యువత దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలి**
**- మండల అధ్యక్షుడు ఎడపల్లి పరశురామ్ పిలుపు**



**వేద న్యూస్, బోయినిపల్లి:**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలంలో స్వామి వివేకానంద జయంతి సందర్భంగా బీజేపీ బోయినిపల్లి మండల శాఖ ఆధ్వర్యంలో ఘనంగా కార్యక్రమం నిర్వహించారు. మండల అధ్యక్షుడు ఎడపల్లి పరశురామ్ నాయకత్వంలో మండల కేంద్రంలో వివేకానంద చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎడపల్లి పరశురామ్ మాట్లాడుతూ.. భారతదేశ ఔన్నత్యాన్ని, యువభారత శక్తి సామర్థ్యాలను ప్రపంచానికి చాటిచెప్పిన మహానీయుడు స్వామి వివేకానంద అని కొనియాడారు. సనాతన ధర్మంలో అంతర్భూతంగా ఉన్న సాంస్కృతిక వారసత్వాన్ని స్వీకరించి, రాబోయే తరాలకు అందించాల్సిన అవసరం ఉందని స్వామి వివేకానంద బలంగా విశ్వసించారని తెలిపారు. జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా వివేకానంద బోధనలు, వ్యక్తిత్వం నుంచి స్ఫూర్తి పొంది యువత వికసిత భారత నిర్మాణంలో భాగస్వాములు కావాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మాజీ మండల అధ్యక్షులు గుడి రవీందర్ రెడ్డి, సీనియర్ నాయకులు శ్రీనివాస్ రెడ్డి, మెరుపుల గంగాధర్, బోగోజి గంగాధర్ చారి, అనిల్, మహేష్, సాయికుమార్, ముసుకు విజయేందర్ రెడ్డి, ధర్మేంద్ర, మనోజ్, ఐలయ్య తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఉచిత ఆరోగ్య శిబిరం

**- అజర హాస్పిటల్ ఆధ్వర్యంలో సేవలు**



**వేద న్యూస్, శాయంపేట:**

ప్రజ్వల సంస్థ ఆధ్వర్యంలో అజర హాస్పిటల్ సహకారంతో శాయంపేట మండల కేంద్రం లోని కొత్తగట్టు సింగారం గ్రామంలో సోమవారం ఉచిత ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో జనరల్ మెడిసిన్, గుండె పరీక్షలు, ఈసీజీ, బీపీ, డయాబెటిస్, గైనిక్ సమస్యలకు సంబంధించిన పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు అందించారు. గ్రామానికి చెందిన సుమారు 187 మంది ప్రజలు ఈ శిబిరంలో పాల్గొని వైద్య సేవలను పొందారు. ఈ కార్యక్రమంలో ప్రజ్వల సంస్థ ఫీల్డ్ ఇంచార్జి పోరండ్ల భానుమతి, పంచాయతీ కార్యదర్శి రాచమల్ల నాగశ్రీ, గ్రామ సర్పంచ్ కూకిడి శివాజీ, ఉపసర్పంచ్ కొత్తగట్టు సాయి, ప్రజ్వల డైరెక్టర్ కూకిడి నాగేశ్వరరావు, 8వ వార్డు సభ్యుడు పాల్వాయి స్వర్ణ వినయ్, వార్డు సభ్యులు, గైనిక్ డాక్టర్ స్వప్న, క్యాంప్ కోఆర్డినేటర్ ధారగిరి, సునీల్, రవిచందర్ తదితరులు పాల్గొన్నారు.

## శివాజీ మహారాజ్ విగ్రహ ప్రతిష్ఠాపనకు భూమి పూజ

**వేద న్యూస్, టేక్మాల్:**



ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహ ప్రతిష్టాపనకు సోమవారం భూమి పూజ కార్యక్రమాన్ని మెదక్ జిల్లా టేక్మాల్ మండల పరిధిలోని వేల్పుగొండ గ్రామంలో ఘనంగా నిర్వహించారు. త్మానంద ఆశ్రమ పీఠాధిపతులు శ్రీ రాజయోగి వెంకటస్వామి దివ్య ఆశీస్సులతో, శ్రీ ఛత్రపతి శివాజీ మహారాజ్ యూత్ సభ్యుడు, గ్రామ సర్పంచ్ ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ కార్యాలయ ప్రాంగణం ముందు బ్రాహ్మణ పండితులతో కొబ్బరికాయ కొట్టి భూమి పూజలు నిర్వహించారు. ఛత్రపతి జయంతి నాటికి విగ్రహ ప్రతిష్ఠాపన పనులు పూర్తి చేస్తామని యూత్ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నిరుడి దాస్, ఉపసర్పంచ్, ఎంపీ సుధాకర్, వార్డు సభ్యులు శ్రీహరి, గ్రామ రాఘవేందర్, పెద్దలు శరత్ చంద్ర దేశ్‌పాండే, అంజాగౌడ్, రాములు, నర్సింలు, ఆగమయ్య, తుమ్మలేశం, కృష్ణ, శ్రీ చత్రపతి శివాజీ మహారాజ్ యూత్ అధ్యక్షులు జ్ఞానాజీగారి ప్రవీణ్ కుమార్, ఉపాధ్యక్షులు ఎంపీ రామకృష్ణ, సభ్యులు రవీందర్, మల్లేశం, నాగరాజుగౌడ్, శేఖర్, వెంకటేశం, ప్రహ్లాద్, బేతయ్య, దుర్గేష్, శ్రీకాంత్, నాగరాజు, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

## ముత్యంపల్లిలో కేఎంపీఎల్ క్రీడలు ప్రారంభం

**వేద న్యూస్, కాసిపేట:**



మంచిర్యాల జిల్లా కాసిపేట మండలంలోని ముత్యంపల్లి గ్రామంలో గల అంబేద్కర్ క్రీడ మైదానంలో కేఎంపీఎల్ సీజన్-4 క్రీడా పోటీలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంపీడీవో సత్యనారాయణ సింగ్, తహసీల్దార్ సునీల్ కుమార్ దేశ్‌పాండే, కేకే గ్రూప్ ఏజెంట్ రాంబాబు హాజరై క్రీడలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. క్రీడలు యువతలో శారీరక దృఢత్వం, క్రమశిక్షణ, స్నేహభావాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇలాంటి క్రీడా పోటీలు నిర్వహించడం యువతకు మేలు చేస్తుందని అభినందించారు. ఈ కేఎంపీఎల్ టోర్నమెంట్‌లో విజేతగా నిలిచిన జట్టుకు మొదటి బహుమతిగా రూ.75,000, రన్నరప్ జట్టుకు రూ.50,000 నగదు బహుమతులు అందజేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. గ్రామ యువత, క్రీడాకారులు పెద్ద సంఖ్యలో పాల్గొని క్రీడా పోటీలను ఉత్సాహంగా తిలకించారు.

## కోటగిరి నుంచి లింగంపల్లి వరకు పాదయాత్ర

**వేద న్యూస్, రుద్రూర్:**



స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని విషావక తీర్థ స్వామి ఆధ్వర్యంలో సోమవారం కోటగిరి మండలంలోని అయ్యప్ప స్వామి ఆలయం నుంచి రుద్రూర్ మండలంలోని లింగంపల్లి శివాలయం వరకు భజనలు, కీర్తనలతో పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా రుద్రూర్ బస్టాండ్ ప్రాంగణంలోని శ్రీ చత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహానికి విషావక తీర్థ స్వామితో పాటు గ్రామ సర్పంచ్ ఇందూరు సునీత పూలమాలలు వేసి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పాదయాత్ర లింగంపల్లి వరకు కొనసాగింది. ఈ కార్యక్రమంలో భక్తులు, హిందూ సంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

వేద న్యూస్

మంగళవారం జనవరి 13, 2026

# రామాలయం జోలికొస్తే సహించేది లేదు

## – అధికారులు, గ్రామస్తుల మధ్య వాగ్వాదం



**వేద న్యూస్, రుద్రూర్:**

రామాలయాన్ని జేసీబీతో కూల్చే ప్రయత్నాన్ని విశ్వహిందూ పరిషత్, బజరంగ్ దళ్, బీజేపీ నాయకులు, గ్రామస్తులు సోమవారం అడ్డుకున్నారు. రామాలయం జోలికి వస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. రుద్రూర్ మండలం సులేమాన్ నగర్ గ్రామంలో రామాలయ స్థలానికి సంబంధించి అధికారులు, గ్రామస్తుల మధ్య వాగ్వివాదం చోటు చేసుకుంది. గ్రామస్తులు మాట్లాడుతూ.. రామాలయానికి ఒక ఎకరం 15 గుంటల భూమి ఉందని, 1997లో గ్రామ పెద్దల అనుమతితో ఆ స్థలంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మాణం జరిగిందన్నారు. ధరణి రికార్డులు, సర్వే నంబర్, పహానీలు ఉన్నాయని, 2018లో రామాలయం పేరుతో ఎండోమెంట్‌లో నమోదు చేశారని తెలిపారు. ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా తహసీల్దార్ జేసీబీతో రావడం సరైంది కాదని ప్రశ్నించారు. ఇది రాజకీయ ఒత్తిడితో జరుగుతున్న చర్యగా అనుమానం వ్యక్తం చేస్తూ, ఆలయ స్థల విషయాన్ని రెవెన్యూ, పోలీస్ అధికారులు సామరస్యంగా పరిష్కరించాలని కోరారు.

# యువత క్రీడా ప్రతిభకు సీఎం కప్ పోటీలు సువర్ణ అవకాశం

## – కలెక్టర్ డాక్టర్ సత్య శారద



**వేద న్యూస్, వరంగల్ ప్రతినిధి:**

యువత తమ క్రీడా ప్రతిభను కనబరచడానికి సీఎం కప్ పోటీలు సువర్ణ అవకాశమని ఈ పోటీలను యువత సద్వినియోగం చేసుకోవాలని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అన్నారు. సోమవారం ఖిలా వరంగల్ లోని ఖుష్ మహల్ వద్ద సీఎం కప్ రెండవ ఎడిషన్ టార్చ్ ర్యాలీ ని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద జెండా ఊపి ప్రారంభించగా, ర్యాలీ నూతనంగా నిర్మిస్తున్న ఐడిఓసి కలెక్టరేట్ వరకు కొనసాగింది. ఈ సందర్భంగా స్వామి వివేకానంద జయంతి సందర్భంగా వారి చిత్రపటానికి పూలమాలలు వేసి కలెక్టర్ డాక్టర్ సత్య శారద, అదనపు కలెక్టర్ సంధ్యారాణి, తదితరులు నివాళులు అర్పించారు. యువత లక్ష్య సాధనలో స్వామి వివేకానందుని మార్గాన్ని అనుసరించాలని అన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రూరల్ నుండి గ్లోబల్ ఛాంపియన్ నినాదంతో గ్రామీణ స్థాయి క్రీడాకారులలో ప్రతిభను వెలికి తీయడం కోసం సీఎం కప్ రెండవ ఎడిషన్ సరైన వేదిక అని ఈ అవకాశాన్ని గ్రామీణ, మండల, జిల్లా స్థాయి యువత విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ క్రీడాపోటీలకు సంబంధించిన అవగాహన కల్పించడానికి జిల్లా కేంద్రం తో పాటు జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లో సీఎం కప్ టార్చ్ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. శాట్స్ ఆధ్వర్యంలో గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు వివిధ స్థాయిల్లో మొత్తం 44 రకాల క్రీడల్లో పోటీలను నిర్వహించడం జరుగుతుందని,ఈ నెల 17 వ తేదీ నుంచి 22 వరకు గ్రామ స్థాయిలో, 28 నుంచి 31 వ తేదీ వరకు వరకు మండల స్థాయి, ఫిబ్రవరి 3 నుంచి 7 తేదీ వరకు నియోజకవర్గ స్థాయిలో, ఫిబ్రవరి 10 నుంచి 14 వరకు జిల్లా స్థాయిలో, ఫిబ్రవరి 19 నుంచి 26 వ తేదీ వరకు రాష్ట్ర స్థాయిలో పోటీలు జరగనున్నాయని తెలిపారు. జిల్లా నుండి క్రీడాకారులు అధికంగా పతకాలు సాధించాలని కలెక్టర్ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమం లో కార్పొరేటర్ ఉమా దామోదర్ యాదవ్, అదనపు కలెక్టర్ సంధ్యారాణి, ఆర్డీఓ సుమా, జిల్లా యువజన క్రీడ అధికారి అనిల్ , డిపిఆర్ఓ ఆయూబ్ అలీ, జిల్లా పశు సంవర్ధక అధికారి బాలకృష్ణ, తహసీల్దార్ మహ్మద్ ఇక్బాల్, ఉమ్మడి వరంగల్ జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ కార్యదర్శి కైలాష్ యాదవ్ , 4వ బెటాలియన్ ఇన్స్పెక్టర్ రాంప్రసాద్, సుధాకర్, కార్యదర్శి కైలాష్ యాదవ్, జిల్లా క్రీడల అధ్యక్ష కార్యదర్శులు, ఇతర అధికారులు, పీడీలు, పిఈటి లు , కోచ్ లు , తదితరులు పాల్గొన్నారు.

# నష్టాల వృత్తిగా మారిన వ్యవసాయం

- ఖర్చుల పెరుగుదలతో ఆదాయాల పతనం
- మద్దతు ధరలు – ప్రకటనలా? అమలులో శూన్యమా?
- అప్పుల ఉచ్చు – రైతును మింగుతున్న వ్యవస్థ
- పరిష్కారాల దారి – వ్యవసాయానికి భవిష్యత్తు ఉందా?



**వేద న్యూస్ డెస్క్:**

భారతదేశం వ్యవసాయ దేశమని గర్వంగా చెప్పుకుంటాం. రైతు దేశానికి అన్నం పెట్టే అన్నదాత అని వేదికలపై గొప్పగా మాట్లాడతాం. కానీ అదే రైతు పొలాల్లో నిలబడి తన పంటను చూస్తూ భవిష్యత్తు ఏమవుతుందోనని భయపడుతున్నాడు. వ్యవసాయం ఒకప్పుడు గౌరవప్రదమైన జీవనాధారం. ఇప్పుడు మాత్రం అనిశ్చితి, అప్పులు, నష్టాల వృత్తిగా మారిందనే అభిప్రాయం రైతుల నోటే కాదౌ సమాజమంతా ఒప్పుకుంటున్న నిజంగా మారుతోంది. ఈ పరిస్థితికి కారణం రైతు అలసత్వమా? లేక పాలన, విధానాలు, వ్యవస్థల వైఫల్యమా? అనే ప్రశ్నకు సమాధానం వెతకాల్సిన అవసరం ఉంది.

**– ఖర్చుల పెరుగుదలౌ ఆదాయాల పతనం**

వ్యవసాయం మొదలుపెట్టే ముందు నుంచే రైతు లెక్కలు వేసుకోవాల్సి వస్తోంది. విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, డీజిల్, కూలీల ఖర్చులు ఏటేటా పెరుగుతూనే ఉన్నాయి. ఒక ఎకరా సాగు చేయాలంటే పెట్టుబడి భారీగా అవసరం అవుతోంది. కానీ పంట పండిన తర్వాత వచ్చే ఆదాయం మాత్రం అదే స్థాయిలో నిలిచిపోతోంది. కొన్ని సందర్భాల్లో ఖర్చుల్ని కూడా తిరిగి పొందలేని పరిస్థితి నెలకొంటోంది. వర్షాలపై ఆధారపడే వ్యవసాయం ఇప్పుడు వాతావరణ మార్పుల దెబ్బకు మరింత అస్థిరంగా మారింది. అకాల వర్షాలు, కరవు, వరదలు రైతు కష్టాన్ని ఒక్కసారిగా నీళ్లలో కలిపేస్తున్నాయి. పంట దిగుబడి బాగున్నా ఆనందపడే పరిస్థితి రైతుకు లేదు. ఎందుకంటే దిగుబడి ఎక్కువైతే మార్కెట్లో ధర పడిపోతుంది. దిగుబడి తక్కువైతే పెట్టుబడి నష్టం. ఏ పరిస్థితిలోనూ రైతుకు భరోసా లేకుండా పోయింది. ఈ అసమతుల్యతే వ్యవసాయాన్ని నష్టాల వృత్తిగా మార్చే మొదటి అడుగు.

**– మద్దతు ధరలు – ప్రకటనలా? అమలులో శూన్యమా?**

కనీస మద్దతు ధరలు రైతుకు రక్షణ కవచంగా ఉండాల్సింది. కానీ వాస్తవంలో అవి ప్రకటనలకే పరిమితం అవుతున్నాయనే విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి. చాలా చోట్ల కొనుగోలు కేంద్రాలు లేవు. ఉన్న చోట్ల ఆలస్యం, నాణ్యత పేరుతో తిరస్కరణలు జరుగుతున్నాయి. దీంతో రైతు తప్పనిసరిగా మధ్యవర్తుల వద్దకు వెళ్లాల్సి వస్తోంది. అక్కడే అసలు నష్టం మొదలవుతుంది. రైతు పంటను తక్కువ ధరకు అమ్మితే, అదే పంట వినియోగదారుడికి చేరేసరికి ధరలు ఆకాశాన్ని అంటుతాయి. ఈ తేడా మొత్తం మధ్యలోని దళారుల జేబుల్లోకి వెళ్తోంది. మార్కెట్ వ్యవస్థ రైతుకు అనుకూలంగా లేకపోవడమే ఈ దుస్థితికి ప్రధాన కారణం. గిట్టుబాటు ధర లేకుండా వ్యవసాయం ఎలా లాభసాటిగా మారుతుంది అన్న ప్రశ్నకు ఇప్పటికీ స్పష్టమైన సమాధానం లేదు.

**– అప్పుల ఉచ్చు – రైతును మింగుతున్న వ్యవస్థ**

వ్యవసాయం సాగు చేయాలంటే రుణాలు తప్పనిసరి అయ్యాయి. బ్యాంకుల నుంచి రుణాలు అందకపోతే రైతు ప్రైవేట్ అప్పులవారిని ఆశ్రయించాల్సి వస్తోంది. అక్కడ వడ్డీలు మరింత భారంగా మారుతున్నాయి. పంట నష్టపోతే రుణం తీర్చే మార్గం కనిపించదు. అప్పు మీద అప్పు పెరిగి రైతు పూర్తిగా అప్పుల ఉచ్చులో చిక్కుకుంటున్నాడు. రుణమాఫీ అనే మాట ఎన్నికల సమయంలో పెద్దగా వినిపిస్తుంది. కానీ అమలులో మాత్రం ఆలస్యం, పరిమితులు రైతును నిరాశకు గురిచేస్తున్నాయి. కొందరికి మాఫీ లభిస్తే, మరికొందరు పూర్తిగా బయటపడుతున్నారు. ఈ అసమానత రైతుల్లో అసంతృప్తిని పెంచుతోంది. అప్పుల భారం కేవలం ఆర్థిక సమస్య మాత్రమే కాదౌ మానసిక ఒత్తిడిని కూడా పెంచుతోంది. వ్యవసాయం నష్టాల వృత్తిగా మారిందన్న భావన ఇక్కడే బలపడుతోంది.

**– పరిష్కారాల దారి – వ్యవసాయానికి భవిష్యత్తు ఉందా?**

వ్యవసాయాన్ని నష్టాల వృత్తిగా మార్చింది రైతు కాదౌ వ్యవస్థల వైఫల్యం. కాబట్టి పరిష్కారాలు కూడా సమగ్రంగా ఉండాలి. గిట్టుబాటు ధరలు కేవలం ప్రకటించడమే కాదు, వాస్తవంగా రైతు చేతికి అందేలా అమలు చేయాలి. కొనుగోలు కేంద్రాలు గ్రామ స్థాయికి చేరాలి. పంట బీమా సకాలంలో పరిహారం ఇచ్చేలా మారాలి. నిల్వ సదుపాయాలు, కోల్డ్ స్టోరేజీలు, మార్కెట్ లింకేజీలు రైతుకు అందుబాటులోకి వస్తే మధ్యవర్తులపై ఆధారపడాల్సిన అవసరం తగ్గుతుంది. చిన్న, సన్నకారు రైతులకు ఆధునిక సాంకేతికత, యంత్రాలు అందించాల్సిన అవసరం ఉంది. వ్యవసాయం లాభసాటిగా మారితేనే యువత మళ్లీ పొలాల వైపు చూస్తుంది. లేదంటే గ్రామాలు ఖాళీ అవుతాయౌ పట్టణాలు భారంగా మారతాయి. రైతు చేతిలో మట్టి మాత్రమే కాదౌ దేశ భవిష్యత్తు ఉంది. ఆ భవిష్యత్తును కాపాడుకోవాలంటే వ్యవసాయాన్ని నష్టాల వృత్తిగా కాకుండా గౌరవప్రదమైన జీవనాధారంగా మార్చాల్సిందే. ఇది పాలకుల బాధ్యత మాత్రమే కాదౌ సమాజమంతా తీసుకోవాల్సిన సమిష్టి బాధ్యత. లేకపోతే అన్నదాత అనే పదం కేవలం నినాదంగా మిగిలిపోయే ప్రమాదం తప్పదు.

# ట్రాఫిక్ చలాన్లకు ఇక డిస్కౌంట్ ఉండదు




**వేద న్యూస్ హైదరాబాద్ :**

వాహనాలకు చలాన్లు విధించినప్పటికీ చివరికి డిస్కౌంట్ ఇచ్చి తగ్గిస్తారనే భావన సమాజంలో ఒక పెద్ద సమస్యగా మారిందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ఇకపై ట్రాఫిక్ చలాన్లకు ఎలాంటి డిస్కౌంట్ ఇవ్వకూడదని ఆయన స్పష్టం చేశారు. ఏ వాహనమైనా ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే, యజమాని బ్యాంకు ఖాతా నుంచి ఆటోమేటిక్‌గా డబ్బులు కట్ అయ్యే విధానం అమలులోకి రావాలని ఆయన అభిప్రాయపడ్డారు. రోడ్డు ప్రమాదాలు తగ్గించాలనే లక్ష్యంతో యూసఫ్‌గూడ స్టేడియంలో నిర్వహించిన 'అర్రైవ్ అలైవ్ఙ కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, దేశంలో ప్రతి నిమిషానికి ఒక రోడ్డు ప్రమాదం జరుగుతుండగా, ప్రతి మూడు నిమిషాలకు ఒకరు ప్రాణాలు కోల్పోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. మైనర్లకు వాహనాలు ఇవ్వడం, మద్యం సేవించి వాహనాలు నడపడం వల్లే ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయని ఆయన పేర్కొన్నారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠినంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి నొక్కి చెప్పారు. వాహనాల రిజిస్ట్రేషన్ సమయంలోనే యజమాని బ్యాంకు ఖాతాను లింక్ చేసి, నిబంధనలు ఉల్లంఘించిన వెంటనే ఖాతా నుంచి జరిమానా కట్ అయ్యే విధానాన్ని తీసుకురావాలని సూచించారు. ఈ వ్యవహారంపై బ్యాంకర్లతో సమన్వయం చేసుకోవాలని అధికారులను ఆదేశించారు. మైనర్లు ప్రమాదాలకు గురైతే వారి తల్లిదండ్రులపై కేసులు నమోదు చేయాలని స్పష్టం చేశారు. రోడ్డు ప్రమాదాల నివారణలో రవాణా శాఖ, పోలీసు శాఖలు సమన్వయంతో పనిచేయాలని ముఖ్యమంత్రి సూచించారు. చాలా సందర్భాల్లో మన తప్పు లేకున్నా ఎదుటివారి నిర్లక్ష్యం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని ఆయన అన్నారు. హైడ్రా, ఈగల్, సైబర్ క్రైమ్ విభాగాలను బలోపేతం చేసినట్లే, ట్రాఫిక్ నియంత్రణలోనూ పోలీస్ వ్యవస్థను మరింత సిద్ధం చేయాల్సిన అవసరం ఉందని రేవంత్ రెడ్డి అభిప్రాయపడ్డారు.

# సర్వే నంబరు 44లో నివాసితులకు హైడ్రా భరోసా

- ఇళ్ల జోలికి వెళ్లం.. అక్రమ వాణిజ్య నిర్మాణాలపైనే చర్యలు
- ప్రభుత్వ భూముల రక్షణ కోసమే ఫెన్సింగ్ : హైడ్రా స్పష్టం






**వేద న్యూస్ రంగారెడ్డి :**

రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం మక్తా మహబూబ్‌పేట గ్రామంలోని సర్వే నంబరు 44లో నివాసం ఉంటున్న ప్రజలు ఆందోళన చెందవద్దని హైడ్రా స్పష్టం చేసింది. ఇప్పటికే నిర్మాణం పూర్తయి నివాసంగా ఉన్న ఇళ్ల జోలికి హైడ్రా వెళ్లదని, అక్రమంగా ప్రభుత్వ భూములను ఆక్రమించి వాణిజ్య సముదాయాలు నిర్మించిన వారిపైనే కఠిన చర్యలు ఉంటాయని వెల్లడించింది. సర్వే నంబరు 44లో మొత్తం 260.01 ఎకరాల విస్తీర్ణం ప్రభుత్వ భూమిగా సేత్వార్ గ్రామ రికార్డుల్లో నమోదై ఉందని హైడ్రా తెలిపింది. ఈ భూమిలో గతంలోనే పెద్ద ఎత్తున నివాసాల నిర్మాణం జరిగిందని, ఆ ఇళ్లను తొలగించే ఉద్దేశం ప్రభుత్వానికి లేదని మరోసారి స్పష్టం చేసింది. అయితే తప్పుడు పత్రాలు సృష్టించి ఎకరాల కొద్దీ భూమిని ఆక్రమించిన కొందరు, తమ అక్రమ నిర్మాణాలు కాపాడుకోవడం కోసం స్థానిక నివాసితులను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని హైడ్రా హెచ్చరించింది. అక్రమ ఆక్రమణలను అరికట్టడానికే ప్రభుత్వ భూముల వద్ద ఫెన్సింగ్ వేస్తున్నామని హైడ్రా పేర్కొంది. ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదు మేరకు బీకే ఎన్‌క్లేవ్ చెరువు పక్కన ఉన్న 5 ఎకరాల ప్రభుత్వ భూమిని ఇప్పటికే రక్షించి ఫెన్సింగ్ వేసినట్లు తెలిపింది. తాజాగా శనివారం, ఆదివారం రెండు రోజుల పాటు సర్వే నంబరు 44లోని మరో 15 ఎకరాల ప్రభుత్వ భూమికి ఫెన్సింగ్ పనులు పూర్తి చేసినట్లు వెల్లడించింది. 2024 జూలైలో హైడ్రా ఏర్పాటుకు ముందు నిర్మించిన ఇళ్లను తొలగించరాదని ప్రభుత్వం ఇప్పటికే నిర్ణయం తీసుకుందని, ఇదే నిబంధన రాష్ట్రవ్యాప్తంగా వర్తిస్తుందని హైడ్రా స్పష్టం చేసింది. తప్పుడు పత్రాలతో రిజిస్ట్రేషన్లు జరిగిన వ్యవహారాన్ని ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుని, సంబంధిత సబ్‌రిజిస్ట్రార్‌ను సస్పెండ్ చేసిన విషయాన్ని గుర్తు చేసింది. అనుమతులు లేని నిర్మాణాలు, అక్రమ వ్యాపారాల ద్వారానే కొందరు నెలకు లక్షల రూపాయల అద్దెలు వసూలు చేస్తున్నారని, తమ అక్రమాలను కాపాడుకోవడానికి నివాసితులను పావులుగా వాడుకుంటున్నారని హైడ్రా ఆరోపించింది. ఈ నిజాలను స్థానిక ప్రజలు గ్రహించాలని, ఎలాంటి అపోహలకు లోనవ్వవద్దని హైడ్రా విజ్ఞప్తి చేసింది.

# నేరాల నియంత్రణకు సీసీటీవీ కీలకం..

**వేద న్యూస్ హైదరాబాద్ :**

నేరాలను నియంత్రించడంలో సీసీటీవీ కెమెరాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని తెలంగాణ పోలీస్ పేర్కొంది. సంక్రాంతి వంటి పండుగల సమయంలో జనరద్దీ ఎక్కువగా ఉండటంతో, నేరాల అవకాశాలను తగ్గించేందుకు ప్రతి ఒక్కరూ సీసీటీవీ వ్యవస్థలను ఏర్పాటు చేసుకోవాలని ప్రజలకు సూచించింది. ఇళ్లలో విలువైన ఆభరణాలు పెట్టుకునే వారు, సీసీటీవీ పర్యవేక్షణ తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలని పోలీసులు తెలిపారు. సీసీటీవీ ఫుటేజ్ ద్వారా నేరస్థులను గుర్తించడం సులభమవుతుందని, ఇది దర్యాప్తులో కీలక సాక్ష్యంగా మారుతుందని వివరించారు. అదేవిధంగా దుకాణాలు, అపార్ట్‌మెంట్లు, కార్యాలయాలు, బస్టాండ్లు వంటి జనసంచారం ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో సీసీటీవీ కెమెరాలు ఉండటం వల్ల నేరాలు జరగకుండా ముందస్తు నిరోధక చర్యగా పనిచేస్తుందని పోలీసులు పేర్కొన్నారు. నేరానికి పాల్పడే ముందు నిందితులు వెనుకడుగు వేయడానికి కూడా ఇది కారణమవుతుందని తెలిపారు. ప్రజల భద్రత కోసం పోలీసులు మాత్రమే కాదు, ప్రతి పౌరుడు భాగస్వామిగా మారాలని తెలంగాణ పోలీసులు పిలుపునిచ్చారు. తమ ఇళ్లలో, పరిసర ప్రాంతాల్లో సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేసి, అవసరమైనప్పుడు పోలీసులకు సహకరించాలని సూచించారు. ప్రజల సహకారంతోనే సురక్షిత సమాజం సాధ్యమవుతుందని పోలీసులు స్పష్టం చేశారు.




Edited, Printed, Published and Owned by Lingabatthini Krishna Printed at Bhavani Enterprises, H.No 16-6-198/B, Perukawada, Warangal, 506002, Telangana State. Published at H.No. 17-3-180, Near Rama Swamy Temple, Warangal Dist, 506002 Telangana State. Editor : Lingabatthini Krishna, Phone : 9701923260. e-Mail : vedhanews22@gmail.com. RNI No : TELTEL/2022/83073